J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 36 6.2.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# తెగులు పట్టిన తెలుగు రాజకీయాలు!



- జుగుప్స కలిగిస్తున్న రాజకీయ భాష
- ఉచ్ఛనీచాలు మరిచి పేట్రేగిపోతున్న నాయకులు
- గతంలో జగన్ పార్టీ.. ప్రస్తుతం కూటమి నేతలు
- దొందూ దొందే అంటున్న జనం
- తెలంగాణలోనూ ఇదే తంతు

***"ఛీ!..ఛీ!.. ఇవేం రాజకీయాలు.. ఇవేం మాటలు. సిగ్గూ, లజ్జ, మానం, మర్యాద, ఉచ్ఛం, నీచం లేని వ్యవహార శైలి" అంటూ తెలుగు రాష్ట్రాల నాయకులపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. వీళ్లా మనల్ని నడిపించే లీడర్లు..? వీళ్లా మనకు చట్టాలను నిర్దేశించే నేతలు..? అంటూ అసహ్యించుకుంటున్నారు. వీధిరౌడీలను తలపించే భాషతో, గంజాయి బ్యాచ్ తరహా ప్రవర్తనతో కొందరు రాజకీయ నాయకులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. నోటికి ఎంతమాటొస్తే అంత మాట అనేస్తూ అగ్గిరాజేస్తున్నారు. ఫలితంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అభివృద్ధి అటకెక్కి, వెకిలి మాటలు, కారుకూతలు, విధ్వంసాలు, దాడులు, ప్రతిదాడులు, అరెస్టులు, కేసులు అంటూ నిత్యం క్షేత్రస్థాయిలో పరిస్థితులు రావణకాష్టాన్ని తలపిస్తున్నాయి. ఈ క్రమంలో తమ సమస్యలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని, అభివృద్ధి కాంక్షించే నేతలే కరువయ్యారని సగటు తెలుగుపౌరుడు వాపోయే దుస్థితి ఏర్పడింది.***

సైకో, గజదొంగ, జేబుదొంగ, వీధికుక్క, గుంట నక్క, కామకుక్క, సన్నాసి కొడక, ఆంబోతు వెధవ, బేవార్స్ నా కొడక, లంబిడికొడకా, నికృష్టుడా, నీయమ్మ మొగుడు, ఒళ్లంతా కాల్చి వాతలు పెట్టాలి, కోసి కారం పెట్టాలి, గుండు కొట్టి బట్టలూడదీసి గాడిద మీద ఉరేగించాలి. ఇవన్నీ ఏ మురా కక్షల ఘర్షణల్లోనో వినిపించే మాటలనుకుంటున్నారా..? అయితే మీరు తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ఇవన్నీ మన జీవితాలను మార్చే, మన భవిష్యత్‌ను తీర్చిదిద్దే, తెలుగు రాష్ట్రాల్లోని శాసనకర్తల నోటి నుంచి వస్తున్న అమూల్యమైన వ్యాఖ్యలు, వెలకట్టలేని పదాలు కాబట్టి. మనం ఓట్లేసి ఎన్నుకున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు చట్టసభల్లో మన తలరాతలను మార్చే చట్టాలు చేస్తారనుకుంటే, వారంతా శాంతిభద్రతలను చెరపట్టి, విధ్వంసాలకు తెరదీసి, ఏకంగా సివిల్‌వార్ (ప్రజాయుద్ధం)కు కారణమయ్యేలా విపరీత ప్రవర్తనతో పేట్రేగిపోతున్నారు. చెప్పలేని భాషతో, రాయలేని మాటలతో మృగాల తరహాలో విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. ఇక వారిని అనుసరించే కార్యకర్తలు, ఏవర్గానికి ఆవర్గం అన్నట్లుగా విడిపోయి ముష్టిఘాతాలకు దిగుతూ ప్రత్యర్థుల ఇళ్లను, వస్తుసామగ్రిని, ఆస్తులను ధ్వంసం చేస్తూ రాక్షసుల్లా, వికటాట్టహాసం చేస్తున్నారు. ఫలితంగా అసలు విషయాలైన అభివృద్ధి, ఉపాధి కల్పన, వృద్ధిరేటు, ఉత్పాదకత, లాభాలు, ఆదాయం, ఆయుఃప్రమాణం, అక్షరాస్యత వంటి విషయాలన్నీ అటకెక్కాయి. నరికేయడం, కొరికేయడం, నారతీయడం, చంపేయడం, ధ్వంసం చేయడం, తగలబెట్టేయడం వంటి క్రూరమైన విషయాలు మీడియాలో వార్తాంశాలుగా మారుతున్నాయి. ప్రజల్లో సైతం చర్చనీయాంశాలవుతున్నాయి.

### ఆంధ్రప్రదేశ్‌లో మరీ అధ్వాన్నం!

పుష్కరకాలం క్రితం చేపట్టిన రాష్ట్ర విభజనతో అతలాకుతలమై , అప్పుల

2లో



# గోరంత పదవికి.. కొండంత ఆర్భాటం!



## • జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలిగా మేకపాటి శాంతకుమారి

మొత్తానికి మేకపాటి చంద్రశేఖరరెడ్డి కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ గుర్తించింది. ఆయన సతీమణికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. అంతవరకూ బాగుంది. అయితే, శాంతకుమారి ప్రమాణస్వీకార ప్రహసనమే జిల్లా రాజకీయ వర్గాలని ఆశ్చర్యపరచింది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం నెల్లూరు నగరంలోని పిచ్చిరెడ్డి కళ్యాణ మండపంలో శాంతకుమారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆమె కంటే ముందు చాలామంది అజ్ఞాత వ్యక్తులు గ్రంథాలయ అధ్యక్ష పదవిని చేపట్టారు. కానీ, వాళ్ళు ఎప్పుడొచ్చిందీ, ఎప్పుడు దిగిపోయిందీ కూడా ఎవరికీ తెలియదు. ఉదాహరణకి గత ప్రభుత్వంలో ఈ సంస్థ అధ్యక్షురాలిగా ఉన్న దొంతు శారద ముఖం కూడా ఎవరికీ తెలియదు. ఆమె గుట్టుగా చార్జి తీసుకుని గుట్టుగానే దిగిపోయింది. అంతకముందు వారి పరిస్థితి కూడా ఇదే. సాధారణంగా ఇలాంటి పదవులు వచ్చిన వారు సంబంధిత కార్యాలయానికి వెళ్ళి అక్కడ రిజిస్టర్‌లో సంతకం చేసి బాధ్యతలు తీసుకుంటారు.

కానీ, శాంతకుమారి అలా చేయలేదు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పత్రికా ప్రకటనలు ఇచ్చారు. వందల కొద్దీ ఫ్లెక్సీలు కట్టారు. భారీ సంఖ్యలో జనాన్ని రప్పించారు. దాదాపుగా జిల్లాలోని నాయక గణాన్ని మొత్తం ఒక వేదికపైకి చేర్చారు. వారందరి సమక్షంలో ముఖ్యమంత్రులు, మంత్రులు చేసిన తరహాలో ప్రమాణస్వీకారం చేశారు. మంచిదే! ఆమె పదవి ఆమె ఇష్టం. దానిని ఎవరూ తప్పుబట్టరు. వారి దగ్గర డబ్బులున్నాయి ఖర్చు పెట్టుకున్నారు. ఆమెకి తోడుగా జనం వున్నారు రప్పించుకున్నారు. చంద్రశేఖరరెడ్డికి సీనియారిటీతో పాటు పలుకుబడి వుంది కాబట్టి నాయకులు తరలి వచ్చారు.

కానీ, సాహితీవేత్తలు, పుస్తకప్రియులు, జిల్లా వాసులూ కోరుకుంటోంది ఒక్కటే. కొన్ని దశాబ్దాలుగా నిరాదరణకి గురైపోయి దీనావస్థలో ఉన్న గ్రంథాలయాలని పునరుద్ధరించమని ప్రార్థిస్తున్నారు. చెదలు పట్టిపోతున్న పుస్తకాలకి రక్షణ కల్పించమని కోరుకుంటున్నారు. ఏ క్షణమైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న గ్రంథాలయాలకు నీడ కల్పించమని వేడుకుంటున్నారు. పాత వసతులతో రోత పట్టిపోయిన లైబ్రరీలకి కొత్త కళ తెమ్మని విజ్ఞప్తి చేస్తున్నారు. శాంతమ్మ శాంతంగా వారి మొర ఆలకిస్తుందని ఆశిద్దాం. ప్రభుత్వం నిధులివ్వకపోయినా తమ సొంత నిధులతో అయినా కనీసం కొన్ని గ్రంథాలయాలకి కొత్త కాంతిని ప్రసాదిస్తుందని ఆకాంక్షిద్దాం...!

### జిల్లాలో వున్న గ్రంథాలయాల దుస్థితిని ఓసారి గమనిస్తే ...

నెల్లూరుజిల్లాలోని అన్ని గ్రంథాలయాలు దీర్ఘకాలంగా దీనావస్థలో ఉన్నాయి. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రధాన వనరుగా ఉండే గ్రంథాలయ సెస్సులు స్థానిక సంస్థల నుంచి సక్రమంగా రాకపోవడంతో ఆ సెస్సు బకాయిలు పాపం పెరిగినట్లు పెరిగి కోట్లల్లోకి వెళ్ళిపోయాయి. వాటి వసూళ్లపై ఎవరూ దృష్టి పెట్టకపోవడంతో, గ్రంథాలయాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉండిపోయింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో జిల్లా కేంద్రమైన నెల్లూరులోని ప్రధాన గ్రంథాలయంతో పాటు, అన్ని శాఖలతో కలిపి జిల్లాలో మొత్తం 61 గ్రంథాలయాలున్నాయి. వీటికి రావాల్సిన సెస్సు బకాయిలు సుమారు 50 కోట్లకు పైగానే ఉన్నాయని సంబంధిత అధికారులు వాపోతున్నారు. ఒక్క నెల్లూరు నగరపాలక సంస్థ నుంచే 41 కోట్లకు పైగానే సెస్సులు రావాల్సి ఉందని గ్రంథాలయ సంస్థ అధికారులు లెక్క చెప్తున్నారు. అదేవిధంగా, కావలి మునిసిపాలిటీ నుంచి కోటీ 22 లక్షలు, గూడూరు నుంచి కోటీ 23 లక్షలు, నాయుడుపేట నుంచి 74 లక్షలు, వెంకటగిరి నుంచి 72 లక్షలు, ఆత్మకూరు నుంచి 68 లక్షలు, బుచ్చి నుంచి 31 లక్షలు, సూళ్ళూరుపేట నుంచి 8 లక్షలతో పాటు జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు చెల్లించాల్సిన సెస్సు బకాయిలు మరో కోటీ 56 లక్షలకి పైగానే ఉన్నాయని అంటున్నారు. ఆ బకాయిలు చెల్లించేదెప్పుడో, గ్రంథాలయాలు బాగుపడేదెప్పుడో ఆ దేవుడికే తెలియాలి. నెల్లూరు కేంద్ర గ్రంథాలయం నూతన భవన నిర్మాణానికి 3 కోట్లు అవసరమైనప్పటికీ నిధులు లేక, ఆ నిర్మాణం ఆదిలోనే ఆగిపోయింది. అల్లూరు, ఇందుకూరుపేట, మనుబోలు, సంగం, మైపాడు, ఏఎస్‌పేట, దగదర్తిలో ఉన్న గ్రంథాలయ భవనాలు చాలాకాలంగా శిథిలావస్థలోనే ఉన్నాయి. వాటిని బాగు చేసే నాథులు లేకపోవడంతో, రేపో మాపో అవి కూలిపోయే దుస్థితిలో ఉన్నాయి. భవనాల మరమ్మతులకు గానీ, పునర్‌నిర్మాణాలకు గానీ, గ్రంథాలయాల్లో పాఠకులకు అవసరమైన కనీస సదుపాయాలకు కానీ నిధులు లేవు. కాలక్రమేణా అనేక గ్రంథాలయాల్లోని పుస్తకాలు చిరిగిపోయి పాడైపోతున్నాయి. ఇక కొత్త పుస్తకాల సంగతి సరే సరి! అవి వచ్చిందీ లేదు పాఠకులు చదువుకుందీ లేదు. ఇప్పటికే లక్షలాదిగా ఉన్న పాత పుస్తకాలకే దిక్కు దివాణం లేదు. అమూల్యమైన గ్రంథాలను పరిరక్షించడం సిబ్బందికి ఇబ్బందిగా మారింది. గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలనీ, సరస్వతీ నిలయాలని ఊరికే గొప్పలు చెప్పుకుంటున్నాం తప్ప, దేవాలయాల్లాంటి ఆ జ్ఞాన సముదాయాలను కాపాడుకోలేకపోతున్నాం. ప్రభుత్వాలు మారుతున్నా, కొత్త పాలకులు వస్తూనే ఉన్నా గ్రంథాలయాలకు ఒరగబెట్టిందేమీ లేదని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడు కొత్తగా జిల్లా గ్రంథాలయ అధ్యక్షురాలిగా నియమితురాలైన శాంత కుమారి జిల్లాలోని గ్రంథాలయాల వాస్తవ పరిస్థితులని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వాటి అతీగతీ పట్టించుకుంటుందని ఆశిద్దాం. అలా పట్టించుకోని పక్షంలో ఇవి సరస్వతీ నిలయాలుగా కాదు కదా, చెదపురుగులకు ఆహారకేంద్రాలుగా మారిపోతాయనడంలో ఎలాంటి అనుమానం అవసరం లేదు...!

# తెగులు పట్టిన తెలుగు రాజకీయాలు!

(మొదటిపేజీ తరువాయి)

కుప్పగా మారిన నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం రాజకీయాలు, వీధిపోరాటాలను తలపిస్తున్నాయి. సిగ్గూ శరం మరిచి అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు తమ జుగుప్సాకరమైన క్రూర మనస్తత్వంతో, మతిలేని మాటలతో ఆటవిక రాజ్యాన్ని తలపిస్తున్నారు. నువ్వు ఒకటంటే, నేను వంద అంటాను, కంటికి కన్ను పంటికి పన్ను తీసేస్తాను అంటూ రెచ్చిపోతున్నారు. దీంతో చిన్నచిన్న విషయాలు సైతం చినికి చినికి గాలివానగా మారి రాజకీయ తుఫానుకు కారణమవుతున్నాయి. ఇటీవల తిరుమల లడ్డూ తయారీలో నెయ్యి కల్తీ వ్యవహారం అధికార కూటమి పార్టీలు, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ పార్టీ మధ్య పరస్పర విమర్శలకు కారణమైన విషయం తెలిసిందే. ఇక రోజూ ఒకరిపై ఒకరు వాగ్బాణాలు సంధించుకోవడం, నిందారోపణలు చేయడం కూడా పరిపాటిగా మారింది. ఈక్రమంలో గుంటూరు జిల్లాలో తెలుగుదేశంపార్టీ నేతలు కల్తీనెయ్యితో వైఎస్సార్ సీపీ తిరుమలలో మహాపచారానికి పాల్పడిందంటూ ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దాన్ని వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రి అంబటి రాంబాబు తమ నేతలు, కార్యకర్తలతో వెళ్లి తొలగించాలంటూ డిమాండ్ చేశారు. ఈక్రమంలో రెండు వర్గాల నాయకులు దాడులకు తెగబడుతూ, చెప్పలేని దుర్మార్గమైన మాటలతో పిచ్చి పట్టినట్లు రెచ్చిపోయి సిగపట్లకు దిగారు. వీరికి అడ్డుకట్ట వేసి తరిమికొట్టాల్సిన పోలీసులు సైతం చోద్యం చూస్తూ నాయకులు మరింతగా రెచ్చిపోయేందుకు అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో తన నాలుకకు అడ్డూ అదుపే లేదన్నట్లుగా అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుని నీచనికృష్టమైన మాటలతో తిట్టిపోశారు. ఆ మాటలన్నీ సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో తెలుగుదేశం నాయకులు, కూటమి పార్టీల కార్యకర్తలు మూకుమ్మడిగా అంబటి రాంబాబు ఇంటిపై ఏకపక్షంగా దాడులు చేసి విధ్వంసానికి తెగబడ్డారు. స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా ఇళ్లు, వాహనాలకు నిప్పు పెట్టి స్వైరవిహారం చేశారు. పోలీసులు చూసీ చూడనట్లు ఉండిపోవడంతో ఇదే అదునుగా కొందరు మరింతగా రెచ్చిపోయి వీరంగం సృష్టించారు. ఆ మరుసటి రోజు తమ నేత లోకేష్‌ను కించపరిచారంటూ ఇంకొందరు మాజీమంత్రి జోగి రమేష్ ఇంటిపై ఏకంగా పెట్రో బాంబులతో దాడి చేయడం సంచలనం కలిగించింది.

### తెలంగాణలోనూ తన్నులాటలే!

ఇక తెలంగాణ రాష్ట్ర విషయానికొస్తే, అక్కడ కూడా మేమేం తక్కువ కాదన్నట్లు రాజకీయ నాయకులు పిచ్చిమాటలు, నీచ ప్రవర్తనతో ముష్టియుద్ధాలకు దిగుతున్నారు. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, మిషన్ భగీరథ స్కీంలో అక్రమాలు, కార్‌రేస్ పోటీల్లో ఆమ్యామ్యాల వ్యవహారం, ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ అండ్ కోకు సిట్ నోటీసుల వ్యవహారం గరంగరంగా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, సందట్లో సడేమిటా అంటూ నిప్పురాజేసే బీజేపీ నేతలు ఒకరిపై ఒకరు దూషణలకు దిగుతూ తమ ప్రతిష్టనే కాకుండా, తెలంగాణ ప్రతిష్టను కూడా మసకబారుస్తున్నారు. ముఖ్యంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ కీలక నేత, మాజీమంత్రి హరీష్‌రావు తమ వికృత మాటలతో విమర్శలపాలవుతున్నారు. చివరికి అసెంబ్లీలో సైతం లాగులో తొండలు వదలుతాం, కనుగుడ్లతో గోలీలాడుతాం, వంగోబెట్టి తొక్కుతాం, గోచీ ఊడగొడతాం, పేడమూతి బోడిలింగం, తిక్కముండాకొడుకులు, పొట్టోడు, గాలిగాడు, నల్లికుట్లోడు, బఫూన్, బేకార్, లోఫర్, జోకర్, లఫుట్, లుచ్చా అంటూ ఒకరిపై ఒకరు అడ్డగోలుగా నీచ నికృష్టంగా తిట్టుకుంటున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌కు నోటీసులివ్వడం అంటే తెలంగాణను అవమానించడమే అంటూ బీఆర్ఎస్ నేతలు ఓవైపు నానాయాగీ చేస్తున్నారు. వీరికి ప్రతిగా కాంగ్రెస్ నాయకులు సైతం తిట్ల దండకం అందుకుంటుండడంతో అక్కడ కూడా పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది.

### తిలాపాపం తలాపిడికెడు!

తెలుగు రాష్ట్రాల్లో శాంతిభద్రతలు రోజురోజుకూ దిగజారిపోవడానికి, విధ్వంసాలు, విపరీత పరిస్థితులు నిత్యకృత్యం కావడానికి అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు, వారికి వంతపాడే మీడియానే కారణమంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే తమ పార్టీ చెప్పిందే వేదం, తమ నాయకుడు మాట్లాడిందే కరెక్ట్ అన్నట్లుగా కార్యకర్తలు రెచ్చిపోతుండడంతో తెలుగు రాష్ట్రాల్లో రోజూ ఎక్కడో ఓ చోట ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. గతంలో తమ పార్టీకి చెందిన కొందరు నాయకులను, మంత్రులను అచ్చోసిన ఆంబోతుల్లా జనంపైకి వదిలేసి జగన్ పెద్దతప్పే చేశారు. దీనికి ప్రతిఫలంగానే ఆయన గత ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితమయ్యారు. ఇక ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి చెందిన అయ్యన్నపాత్రుడు, పట్టాభి వంటివారు అనుచిత వాఖ్యలు చేసి దాడులకు గురయ్యారు. ఇక జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైసీపీ కొడకల్లారా, రండి, తొక్కినారతీస్తా, పిసికేస్తా అంటూ హుందాతనం మరిచి చెప్పు చూపిస్తూ పైత్యం ప్రదర్శించారు. తద్వారా తీవ్ర విమర్శలను మూటకట్టుకున్నారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత కూడా దాదాపుగా ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. జగన్ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న తప్పులు, తమ హయాంలో జరగకూడదని జాగ్రత్త పడకుండా దాడులు, విధ్వంసాల సంస్కృతిని తెలుగుదేశం, జనసేన పార్టీల నేతలూ కొనసాగిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. క్లాస్ లీడర్‌గా, పక్కా అడ్మినిస్ట్రేటర్‌గా పేరుగాంచిన చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో ఇలాంటి దుస్సంప్రదాయాలు కొనసాగడం విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటికే ఆర్థికంగా కుదేలై, అష్టకష్టాలు, పడుతున్న రాష్ట్రానికి ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో పెట్టుబడులు వస్తాయా..? అసలు పారిశ్రామిక వేత్తలు ఏపీ వైపు చూస్తారా..? అన్నది సమాధానం లేని ప్రశ్నగా మారింది. ఇక తెలంగాణలోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ధనిక రాష్ట్రంగా ప్రారంభమై నేడు అప్పుల కుప్పగా మారిన రాష్ట్రంలో నాయకుల దిగజారుడు భాష, విపరీత ప్రవర్తన వల్ల హైదారాబాద్ బ్రాండ్ దెబ్బతింటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా రెండు తెలుగు రాష్ట్రాల్లోని అధికార విపక్ష పార్టీల నాయకులు అహంకారం, కక్షా కార్పణ్యాలు, ప్రతీకార రాజకీయాలను పక్కనపెట్టి, అభివృద్ధిపై దృష్టిసారించాల్సిన అవసరం కనిపిస్తోంది. సాధారణంగా కేంద్ర బడ్జెట్ వస్తోందంటే దాదాపుగా ఆ వారమంతా ప్రాజెక్టులకు నగదు కేటాయింపులు, పథకాలకు నిధులు విడుదల, కొత్త స్కీంలు, ఆదాయ వ్యయాలు, పన్ను మినహాయింపులపై విస్తృత స్థాయిలో చర్చ జరిగేది. కానీ తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న రాజకీయ రచ్చల కారణంగా చివరికి కేంద్ర బడ్జెట్ సమయంలోనూ ఆర్థికాంశాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పక్కకెళ్లి, దాడులు, విధ్వంసాలు,బూతు మాటలు, కేసులు, అరెస్టులు పత్రికల్లో ప్రధాన శీర్షికలు మారాయి. కాగా, ఇవన్నీ తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న దిగజారుతున్న రాజకీయ, నైతిక విలువలకు తార్కాణమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేమైనా రాజ్యాంగబద్ధ పదవులనుభవిస్తున్న గౌరవ లీడర్ల గలీజు భాష తెలుగు రాష్ట్రాల ప్రతిష్టను అథఃపాతాళానికి తీసుకెళ్తోందనడంలో సందేహమే లేదు..!

# నేత్రపర్వంగా..జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో వేమిరెడ్డి దంపతులు

నెల్లూరులోని ఇస్కాన్ మందిరం వారి ఆధ్వర్యంలో జనవరి 31న 13వ జగన్నాథ రథయాత్ర (జగన్నాథ-బలదేవ-సుభద్ర) నేత్రపర్వంగా జరిగింది. స్థానిక కలెక్టరేట్ సమీపంలో ఈ రథ యాత్రను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్), ఆయన సతీమణి..కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ప్రారంభించారు. ఇస్కాన్ నిర్వాహకులు శుకదేవస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ రథయాత్ర అంగరంగవైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఇస్కాన్ పుస్తకాన్ని వేమిరెడ్డి దంపతులు ఆవిష్కరించారు. కలెక్టరేట్ కూడలి వద్ద నుంచి బారకాసు సెంటర్, పెద్దబజారు, చిన్నబజారు, ములుముడి బస్టాండ్ సెంటర్, సంతపేట, ఏసీ బొమ్మ కూడలి, గాంధీబొమ్మ సెంటర్‌ల మీదుగా సర్వోదయ కళాశాల వరకు రథయాత్ర సాగింది. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నగర ఏఎస్పీ దీక్ష ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ రథయాత్రకు వేమిరెడ్డి దంపతులు 6లక్షల విరాళం అందించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, దైవ చింతనతో మన చింతలన్నీ మాయ మవుతాయన్నారు. ఆ భగవంతుడిని ప్రజల వద్దకు చేర్చేలా ఇస్కాన్ మందిరం వారు ఈ రథయాత్రను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారని ఆయన కొనియాడారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. 'అక్షయపాత్ర' కార్యక్రమం ద్వారా ఇస్కాన్ సంస్థ ఎంతోమంది ఆకలి తీరుస్తోందన్నారు.

అనంతరం, జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులకు విపిఆర్ దంపతులు అన్నప్రసాద సదుపాయం కల్పించారు. టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఇస్కాన్ సభ్యులు రాజ శేఖర్, ఇంద్రానుజ దాస్, గిరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లన్నకి..స్వర్ణ రథోత్సవం

### పాల్గొన్న శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి



ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇటీవల శ్రీశైలక్షేత్రంలో స్వామివారికి, అమ్మవారికి స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు, మన నెల్లూరీయులు వేమిరెడ్డి కోటారెడ్డి పాల్గొని రథాన్ని లాగారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆరుద్రోత్సవంలో భాగంగా తెల్లవారుజామున శివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు స్వామివారి ఆలయానికి స్వర్ణరథం సమర్పించిన విషయం తెలిసిందే. ఈ రథోత్సవంలో శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు, కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక దందాపై గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయిస్తాం

### • నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



కలువాయి మండలం తెలుగురాయపురం వద్ద నదిని కొల్లగొడుతున్న మాఫియాపై విచారణ చేపట్టాలని గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయిస్తామని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పర్యావరణ విధ్వంసానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వెంకటగిరి నియోజక వర్గంలో ఇసుక దందా రాజ్యమేలుతోందని, ప్రజాధనాన్ని దోచుకుంటూ, నదులను నాశనం చేస్తున్న కూటమి ఇసుక మాఫియాపై స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదని ఆయన ధ్వజమెత్తారు.

**కూటమి నాయకుల తీరు దారుణం..**

కూటమి నేతల తీరు దారుణంగా ఉందని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ఇటీవల ఆయన వెంకటగిరిలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో అధికారపార్టీ నాయకులు, పోలీసులు హద్దుమీరి ప్రవర్తిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. 'మీ ఆగడాలు ఎక్కువ కాలం సాగవు' అని హెచ్చరించారు. ఎమ్మెల్యేకి కొమ్ము కాస్తూ, వైఎస్సార్‌సీపీ చెందిన తమ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేని తిట్టారని ఎవరో ఫిర్యాదు చేస్తే, విచారణ లేకుండా స్టేషన్‌లో కూర్చోబెట్టే అధికారం మీకు ఎవరిచ్చారని ఆయన నిలదీశారు.

### నరసింహకొండ దేవాలయం మాజీ చైర్మెన్..

# శ్రీనివాసులురెడ్డి ఇక లేరు!



నెల్లూరు రూరల్ మండలం, నరసింహకొండలోని వేదగిరి నృసింహస్వామి దేవాలయం మాజీ చైర్మెన్, పొట్టేపాళెం మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి బుధవారం గుండెపోటుతో పొట్టేపాళెంలోని ఆయన నివాసంలో హఠాన్మరణం చెందారు. ఆయన వయసు 74 సంవత్సరాలు. ఈ సమాచారం తెలియగానే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మెన్ అబ్దుల్ అజీజ్, ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, జెడ్. శివప్రసాద్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, రూప్‌కుమార్ యాదవ్‌లు శ్రీనివాసులురెడ్డి పాడెని మోశారు. పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.



శ్రీనివాసులురెడ్డి పాడెని మోస్తున్న కోటంరెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్



### అక్రమార్కుల కబ్జా నుండి నన్ను కాపాడిన

# శ్రీధరన్నా.. మీకు ధన్యవాదాలు!



*"హలో అండీ...*

గుర్తున్నానా..? నేనండీ మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జి దగ్గర దీనావస్థలో వున్న పోలీస్ అవుట్ పోస్టుని. హమ్మయ్య... గుర్తుపట్టారా..! ఎప్పుడో రెండేళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో అనుకుంటా నా ఆవేదనని మన 'లాయర్' పత్రిక ద్వారా వ్యక్తం చేశా. అప్పట్లో ఎందుకనో ఎవరూ నా మొర వినలేదు. ఇప్పుడు నా దుస్థితిని ఓ అజ్ఞాత వ్యక్తి రూరల్ ఎం.ఎల్.ఏ శ్రీధరన్న దృష్టికి తీసుకెళ్ళాడంట. ఆయన ఒక్కక్షణం కూడా ఆలస్యం చేయకుండా నా బాధని, నా చుట్టూ జరిగిన దురాక్రమణలని సంబంధిత అధికారులకి తెలియపరిచారు. నా ఆస్తిని అక్రమార్కుల చెరనుండి తక్షణమే విడిపించమని ఆదేశించారు. అధికారులు సైతం అంతే వేగంగా స్పందించారు. ప్రజల సౌకర్యం కోసం వదిలిపెట్టిన నా స్థలాన్ని కబ్జా చేసి గడచిన 20 సంవత్సరాలుగా తమ వ్యాపారానికి అడ్డాగా మార్చుకున్న అక్రమదారుడికి నోటీసులిచ్చారు. వారంలోగా స్థలం ఖాళీ చేయవలసిందిగా హుకుం జారీ చేశారు. అప్పటికే నా ఆస్తిని ఓ న్యాయవాదికి అమ్మాలని ప్రయత్నాలు చేస్తుండిన ఆ దుకాణ నిర్వాహకుడు ఈ పరిణామాలతో ఖంగుతిన్నాడు. తన ప్రయత్నాలని విరమించుకుని అక్రమంగా ఆక్రమించుకున్న నా ఆస్తిని ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. ఇన్నేళ్ళకి నా ఆస్తి నాకు దక్కింది. ఇప్పుడు నా ప్రాంగణం విశాలంగా మారిపోయింది. భవిష్యత్తులో నన్ను నేను విస్తరించుకోవడానికి వీలుగా తయారయ్యింది. రాబోయే రోజుల్లో శ్రీధరన్న ఆశీస్సులతో నాకు కొత్తకళ వస్తుందన్న విశ్వాసం నాకుంది.

***అన్నా, శ్రీధరన్నా...***

నా బాధని అర్థం చేసుకుని కోట్ల విలువ చేసే నా ఆస్తిని కాపాడినందుకు ధన్యవాదాలన్నా. మునిసిపల్ కార్పొరేషన్ మరియు పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో నన్ను పునురుద్ధరించండి. మాగుంట లే అవుట్‌కి సింహద్వారంలో వున్న నేను కంటిమీద కునుకు లేకుండా పహారా కాస్తాను. సుమారు 5కోట్లరూపాయలకి పైగా విలువ చేసే నన్ను ప్రజలకి కావలసిన విధంగా సద్వినియోగం చేయండి. మనసా, వాచా, కర్మణా మరోసారి మీకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ ...

సదా మాగుంట లే అవుట్ నివాసితుల సేవాభిలాషి...

మీ,

పోలీస్ అవుట్ పోస్టు"






లాయర్
ఫిబ్రవరి 06, 2026

# ఇంకా బాలారిష్టాల్లోనే.. బాలికా విద్య!

మనదేశంలో బాలికా విద్య ఇంకా బాలారిష్టాల్లోనే ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళయినా.. బాలికలు ఉన్నత విద్యలు చదువుకోవడానికి ఉన్న ఆటంకాలు తొలగిపోవడం లేదు. ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి అనేకరకాల పథకాలు ప్రవేశపెడు తున్నా ఆచరణలో నేటికీ లక్షలాది మంది బాలికలు విద్యకు దూరంగానే ఉంటుండడం బాధాకరం. అయితే, మునుపటి కాలంతో పోల్చుకుంటే, నేటి ఆధునిక కాలంలో బాలికల విద్య ఎంతో మెరుగ్గానే ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. దేశంలో కోట్లాదిమంది బాలికలు ఉన్నత విద్యలు సైతం బాగా చదువుకుంటున్నారు. విద్య ప్రాధాన్యతను అర్థం చేసుకుని తల్లితండ్రులు వారిని ప్రోత్సహిస్తున్నారు. అయితే, అంత మాత్రాన అంతా బాగుందనుకోలేం. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అధికశాతం బాలికలు ప్రాథమిక విద్య వరకు బొటాబొటిగా చదువుకుంటున్నా, ఆ తర్వాత ఉన్నత పాఠశాలకో, లేదా ఇంటర్‌స్థాయికో వచ్చేసరికి, ఇక చదువుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా లింగ వివక్ష, సామాజిక పరిస్థితులు, కుటుంబ ఆర్థిక స్థితిగతులు, తల్లితండ్రుల నిరక్షరాస్యత, పాఠశాలల్లో అభద్రత.. అసౌకర్యాలు, విద్యావ్యవస్థలో పెరుగుతున్న అసమానతలు.. ఇలా అనేకరకాల కారణాలు బాలికలను బడిబాట నుంచి తప్పించేస్తున్నాయి. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచమంతా దాదాపు ఇదే దుస్థితి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.3 కోట్ల మంది బాలికలు నేటికీ విద్యకు దూరంగానే ఉంటున్నారని ఇటీవల యునెస్కో అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాల్లోనూ, దేశంలో కూడా అందుకు భిన్నంగా ఏమీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పాత కాలపు మూఢాచారాలు, చాదస్తాలు, అమ్మాయిలు ఎంత చదువుకున్నా ఒకింటికి కోడలిగా వెళ్ళాల్సిందే కదా..అంటూ మధ్యలోనే చదువు మాన్పించే తల్లితండ్రులకు మనదేశంలో కొదవ లేదు. ఇంట్లో పనులు చేయడానికనో, లేదా పెళ్లి చేసి పంపించేస్తే సరిపోతుంది కదా అనుకోవడమో.. లేదా ఆడ పిల్లలు భారమనుకునేవారికి..ఆ బాలికలు లోలోపలే పడుతున్న వేదన అర్థం కావడం లేదు. అందరిలా తామూ చదువుకోలేకపోతున్నామని వారు మానసికంగా కుంగిపోతూ, పెద్దలను ఎదిరించలేక, స్వయంగా చదువుకునే పరిస్థితి లేక దేశంలో లక్షలాది మంది ఆడపిల్లలు అసహాయ స్థితిలో నలిగిపోతున్నారంటే అతిశయోక్తి కాదు. మరోవైపు.. పేదరికం, అజ్ఞానం నిండిఉండే గామీణ ప్రాంతాలు, లేదా కొండ కోనల్లోని ఆదివాసీ, గిరిజన, బడుగు బలహీన వర్గాల వారి పిల్లలు అనేకమంది నేటికీ ఉన్నత విద్యలకు దూరంగానే ఉంటుండడం గమనార్హం. అందుకే బాల్యవివాహాలు కూడా చాటుమాటుగా జరిగిపోతూనే ఉన్నాయి. ఆడపిల్ల పుడితే ఇంట్లో లక్ష్మీదేవి పుట్టినట్లు సంబరపడే తల్లితండ్రులు ఎందరో ఉన్నా, లింగ వివక్షతో అబ్బాయిలను ఒకరకంగా, అమ్మాయిలను మరో రకంగా చూసే అమ్మానాన్నలూ లేకపోలేదు. కన్నబిడ్డల జీవితాల్లో అక్షరజ్యోతులు వెలిగించి, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన తల్లితండ్రులు..బాలికల పట్ల మాత్రం నిర్లక్ష్యంగా ఉండడమే అందుకు ప్రధాన కారణం అనుకోవచ్చు. దీంతో బాలికలకు ఎదిగేకొద్దీ విద్య ఒక్కో అడుగు దూరమవుతూనే ఉంది. వాస్తవానికి మనదేశంలో అటు కేంద్రం కానీ, ఇటు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కానీ, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే ఉన్నాయి. లక్షల సంఖ్యలో స్కూళ్ళు, హాస్టళ్లు, ఉచిత భోజనం, ఉచిత విద్య అన్నీ అందుబాటులో ఉంటున్నాయి కూడా. నేటి బాలికలే రేపటి నారీమణులై కుటుంబానికి, సమాజానికీ మార్గదర్శకంగా..దేశానికే గర్వకారణంగా నిలుస్తున్నవారు కూడా కొల్లలుగానే ఉన్నారు. కానీ, అత్యధికశాతం నిరుపేద-బడుగువర్గాల వారిలో అలాంటి అవగాహన లేకపోవడం ఒక పెద్ద లోపం..కాదు, శాపం!.. ఎంతకాలమిలా?..అందుకే, ఇకనైనా ముందుగా తల్లితండ్రుల ఆలోచనా ధోరణి మారాలి. మన లోపాన్ని మనమే సరిదిద్దుకోవాలి. ఎవరైనా సరే..బిడ్డల చదువులకే ప్రాధాన్యత ఇవ్వాలి. ఎంత కష్టపడైనా సరే ఆడపిల్లలను చదివించుకోవాలి. ఆడపిల్ల చదువుకుంటే, ఆ కుటుంబమంతా చదువుకున్నట్లేనని తెలుసుకోవాలి. అలాంటి చైతన్యం తల్లితండ్రుల్లో వస్తే తప్ప.. క్షేత్రస్థాయిలో బాలికా విద్యకు ఉన్న ఆటంకాలు తొలగవు. ప్రభుత్వాలు, అధికారులు, స్వచ్ఛంధసంస్థల వారేకాక, చదువుకున్న వారంతా కలసి, ఆయా ప్రాంతాల్లో చదువు ఎంత ఉన్నతమైనదో తల్లితండ్రుల్లో అవగాహన కల్పించి, తద్వారా బాలికా విద్యకు చేయూతనందించకపోతే.. ఇంకెన్ని ఏళ్లు.. తరాలు గడిచినా బాలికల తలరాతలు మాత్రం మారనే మారవు!..

# నెయ్యి వివాదంలో వైసీపీ సెల్ఫ్ గోల్ వేసుకుంటుందా?

తాజాగా నిత్యం వార్తలలో కనిపిస్తున్న, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో వినిపిస్తున్న అంశం తిరుమల నెయ్యి వివాదం. కోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జరిపిన దర్యాప్తులో సుమారు రెండున్నర సంవత్సరాల పాటు తిరుమలలో ప్రసాదాలు తయారు చేయడానికి అసలు నెయ్యే వాడలేదని తేల్చింది. నెయ్యికి బదులుగా వాడిన పదార్థంలో జంతువుల కొవ్వు వాడలేదని మాత్రమే సిట్ చెప్పింది తప్ప, అసలు ప్రసాదాలలో వాడింది నెయ్యే అని ఎక్కడా చెప్పలేదు. ఆ రెండున్నర సంవత్సరాల కాలంలో అధికారంలో వున్నది వైసీపీయే కదా! మరి తిరుమలలో జరిగిన ఘోర అపచారానికి బాధ్యత వైసీపీ ప్రభుత్వానిదే అన్న విషయం ఆ పార్టీ పెద్దలు, ఇతర నేతలు విస్మరిస్తున్నారన్నది నా అభిప్రాయం. అసలు సరఫరా అయ్యింది నెయ్యే కాదని సిట్ తేల్చినప్పుడు, అందులో జంతువుల కొవ్వు వాడారా.. లేదా? అన్నది ఇక్కడ అప్రస్తుతం. వైసీపీ జంతువుల కొవ్వునే పట్టుకుని వేలాడడం చూస్తుంటే హత్య కేసు విచారణలో “హత్య చేసింది మేమే.. కానీ హతుడి వంటిపై నగలు దోచుకుంది మాత్రం మేము కాదు” అన్నట్లుగా ఉంది. ఇక్కడ హత్య జరిగిందా లేదా..? అన్నది ప్రధాన అంశం. అంటే, నెయ్యిలో ఏం వాడారన్నది ప్రధానం కాదు, అసలు నెయ్యి వాడారా లేదా..? అన్నది ఇక్కడ పరిగణనలోకి తీసుకోవలసిన అంశం. చేసిన తప్పుని కప్పిపుచ్చుకునే క్రమంలో జంతువుల కొవ్వు అంశాన్ని తెరపైకి తెచ్చి ఈ అంశంలో వైసీపీ సెల్ఫ్‌గోల్ వేసుకుందన్నది నా అభిప్రాయం. ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా, వైసీపీ హయాంలో తిరుమలలో నెయ్యికి బదులుగా కొన్ని రసాయనాలతో కూడిన పదార్థాన్ని వాడారన్నది నిజం.. నిజం.. నిజం...!

యం. చంద్రమౌళి - కొత్తఢిల్లీ.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# ఊరిస్తున్న విజయవాడ - బెంగళూరు వందేభారత్ రైలు!

విజయవాడ నుండి బెంగళూరుకి వందేభారత్ రైలు ప్రారంభం కాబోతోందని గత ఆరు నెలలుగా సామాజిక మాధ్యమాలలో ఒక వార్త చక్కర్లు కొడుతూనే వుంది. గత ఏడాది మన ‘లాయర్’లో కూడా ఆ వార్త వచ్చింది. రైలు మంజూరు అయ్యిందని నంబర్లు కూడా కేటాయించబడ్డాయని రైల్వే అధికారులు కూడా ధ్రువీకరిస్తున్నారు. కానీ, ఇంతవరకూ అది ప్రారంభం కాలేదు. ఈ రైలు ప్రారంభమైతే విజయవాడతో పాటు ఒంగోలు, నెల్లూరు, తిరుపతి నుండి బెంగళూరుకు వచ్చేవాళ్ళకి చాలా సౌకర్యంగా ఉంటుంది. అలాగే బెంగళూరు నుండి అటు వెళ్ళే వారికి కూడా చాలా ఉపయోగం. నెల్లూరు, ఒంగోలు పార్లమెంటు మరియు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి, బీద మస్తాన్‌రావు, వై.వీ.సుబ్బారెడ్డిలు ఈ అంశంపై పార్లమెంటులో, రాజ్యసభలో ప్రస్తావించి సాధ్యమైనంత త్వరలో ఈ వందేభారత్ రైలుని ప్రారంభింప చేయాలని నా మనవి..!

బి. హేమంత్‌కుమార్‌రెడ్డి - బెంగళూరు.

# ఇది వికసిత్ భారత్ బడ్జెట్

మనసులో మాట 83

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1, 2026న ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్, కేవలం సంఖ్యల సంకలనం కాదు; అది భారత ఆర్థిక వ్యవస్థను ‘వికసిత్ భారత్’ లక్ష్యం దిశగా నడిపించే ఒక వ్యూహాత్మక ప్రణాళిక. తక్షణ ప్రయోజనాల కంటే దీర్ఘకాలిక మౌలిక వసతుల కల్పనపైనే ప్రభుత్వం ఎంతగా దృష్టి సారించిందో ఈ బడ్జెట్ స్పష్టం చేసింది. రాజకీయ పటాటోపానికి తావు లేకుండా, ఆర్థిక క్రమశిక్షణను కాపాడుతూనే రూ.53.5లక్షల కోట్ల వ్యయంతో రూపొందించిన ఈ బడ్జెట్, దేశీయ ఉత్పాదకతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా ‘ఆపరేషన్ సిందూర్’ తర్వాతి పరిణామాల్లో రక్షణ రంగం, దక్షిణ భారత్ అభివృద్ధిలో కీలకమైన బుల్లెట్ రైలు కారిడార్లు ఈ బడ్జెట్‌కు ఆయువుపట్టుగా నిలిచాయి.

## రక్షణ రంగంలో స్వావలంబన దిశగా అడుగులు

ఈ ఏడాది బడ్జెట్‌లో రక్షణ రంగానికి సుమారు రూ.7.85 లక్షల కోట్లు కేటాయించడం దేశ చరిత్రలో ఒక మైలురాయి. గత ఏడాదితో పోలిస్తే 15 శాతం మేర పెరిగిన ఈ నిధులు, కేవలం సైనిక బలగాల నిర్వహణకే కాకుండా ఆధునికీకరణకు పెద్దపీట వేశాయి. ముఖ్యంగా రక్షణ మూలధన వ్యయాన్ని రూ.2.19 లక్షల కోట్లకు పెంచడం గమనార్హం. ఇందులో అత్యధిక భాగం దేశీయ కంపెనీల నుంచే కొనుగోళ్లకు కేటాయించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వంటి నౌకాదళ కేంద్రాలకు, అనుబంధ పరిశ్రమలకు గొప్ప ఊతం లభించనుంది. విమానాలు, ఏరో ఇంజిన్ల తయారీ కోసం రూ.63,733 కోట్లు కేటాయించడం ద్వారా రక్షణ రంగంలో చైనా వంటి పొరుగు దేశాలకు ధీటైన పోటీ ఇచ్చేలా స్వయం సమృద్ధిని సాధించే ప్రయత్నం కనిపిస్తోంది.

## ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రవాణా విప్లవం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఈ బడ్జెట్ ఒక రవాణా విప్లవాన్నే పరిచయం చేయబోతోంది. ప్రతిపాదిత ఏడు హై-స్పీడ్ రైల్ కారిడార్లలో మూడు కీలకమైనవి తెలుగు రాష్ట్రాల గుండా వెళ్లడం విశేషం. హైదరాబాద్-విజయవాడ-విశాఖపట్నం కారిడార్ ద్వారా ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం పారిశ్రామికంగా సరికొత్త రూపును సంతరించుకోనుంది. అదే సమయంలో, రాయలసీమ మీదుగా బెంగళూరు-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ రైలు మార్గాలు ప్రతిపాదించడం వల్ల వెనుకబడిన ప్రాంతాల ఆర్థిక పరిస్థితి మారిపోనుంది. ఈ కారిడార్ల కోసం ఏపీలో సుమారు 988హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంటుందని అంచనా. ఈ ప్రాజెక్టులు పూర్తయితే హైదరాబాద్ నుండి బెంగళూరుకు కేవలం 2 గంటల్లో, విశాఖకు 3 గంటల్లో ప్రయాణించే అవకాశం ఉంటుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ/అమరావతికి ప్రస్తుతం రైలులో 5-6 గంటలు, రోడ్డు మార్గంలో 4-5 గంటలు పట్టే ప్రయాణం, బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే కేవలం 90నిమిషాల(1.5గంట) లోపు పూర్తి అవుతుంది. ఇది ఏపీలోని రియల్ఎస్టేట్, ఐటీ రంగానికి సరికొత్త మార్కెట్లను సృష్టిస్తుంది.

## పారిశ్రామిక హబ్‌గా ఏపీ

అమరావతికి రూ.2,500 కోట్లు, పోలవరానికి రూ.4,500 కోట్ల కేటాయింపులు రాష్ట్ర మౌలిక వసతుల కల్పనలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈసారి ఏపీకి దక్కిన గొప్ప వరం ఏమిటంటే ‘రేర్ ఎర్త్ కారిడార్’. పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్‌కు ఒక అరుదైన అవకాశం అయితే దేశానికి వ్యూహాత్మకంగా గొప్ప ముందడుగు. ఖనిజ సంపన్నమైన రాష్ట్రాల్లో మైనింగ్, ప్రాసెసింగ్, తయారీని ప్రోత్సహించడానికి కేంద్రం ఈ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇది సెమీకండక్టర్, హై-టెక్ ఎలక్ట్రానిక్స్ తయారీలో చైనా ఆధిపత్యాన్ని తగ్గించే వ్యూహంలో భాగంగా ఏపీని ఒక అంతర్జాతీయ కేంద్రంగా మారుస్తుంది. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌ల అభివృద్ధికి దక్కిన దన్ను కూడా రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి దోహదం చేస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది కేవలం అంకెల బడ్జెట్ కాదు, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును ప్రపంచ చిత్రపటంలో నిలిపే ఒక దార్శనిక పత్రం.

## అభివృద్ధి సాధక బడ్జెట్

బడ్జెట్ మొత్తం వ్యయం రూ.53.5 లక్షల కోట్లుగా ఉన్నప్పటికీ, ద్రవ్యలోటును 4.3 శాతానికి కట్టడి చేయడం ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనం. పెట్టుబడి వ్యయం రూ.12.2 లక్షల కోట్లకు చేరడంవల్ల దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఆదాయపు పన్ను స్లాబులలో మార్పులు లేకపోయినా, కొత్త ఆదాయపు పన్ను చట్టం - 2025... ఏప్రిల్ 2026 నుండి అమలులోకి వస్తుందని ప్రకటించడం సంస్కరణల దిశగా ఒక అడుగు. స్టాక్ మార్కెట్లలో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను స్వల్పంగా పెంచడం ద్వారా స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను నియంత్రించే ప్రయత్నం చేశారు.

మొత్తంగా చూస్తే, 2026-27 బడ్జెట్ కేవలం తాయిలాల బడ్జెట్ కాదు; ఇది మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఆర్థిక పురోగతిని సాధించే అభివృద్ధి సాధక బడ్జెట్. రక్షణలో స్వయం సమృద్ధి, హై-స్పీడ్ రవాణా వ్యవస్థల విస్తరణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు పారిశ్రామిక దన్ను కల్పించడం ద్వారా ప్రభుత్వం భవిష్యత్ భారత్‌కు బలమైన పునాది వేసింది. ముఖ్యంగా ఏపీకి బుల్లెట్ రైలు మరియు రేర్ ఎర్త్ కారిడార్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర రూపురేఖలను మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్, ఆంధ్రప్రదేశ్‌ను ఒక ‘పారిశ్రామిక శక్తి’గా నిలిపేలా ఉంది. ఈ నిధులను, ప్రాజెక్టులను రాష్ట్ర నాయకత్వం ఎంత వేగంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తుందనే దానిపైనే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

**• కసుమూరులో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రారంభించిన ఇన్‌చార్జి మంత్రి ఫరూక్**



నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తదితరులు

రాష్ట్రంలో మహిళల అభ్యున్నతి, వారి ఆర్థిక స్వావలంబనే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ చెప్పారు. ఈనెల 1న వెంకటాచలం మండలంలోని కసుమూరు దర్గా ప్రాంగణంలో, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి, వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్‌డెవలప్మెంట్ సెంటర్ (నైపుణ్యాభివృద్ధి కేంద్రం)ని, భక్తులకు నిత్యాన్నదాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ కేంద్రాల్లో మహిళలకు వివిధ వృత్తుల్లో నైపుణ్యం కలిగించి వారు స్వయం ఉపాధి పొందేలా కృషిచేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా దర్గా అభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో ఉపరాష్ట్రపతిగా ఉన్న వెంకయ్యనాయుడు ఈ దర్గా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. తన బాల్యం కూడా దర్గా సమీపంలోనే గడిచిందని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, మంత్రి ఫరూక్, అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో దర్గాలో రెండు మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో 17 స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని నెల్లూరు నగరం బారాషాహీద్ దర్గా, ఏఎస్ పేట దర్గాలో కూడా ఈ కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. వీటిలో తొలుత కుట్టు శిక్షణ ప్రారంభించి అందరికీ అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం కంప్యూటర్ ట్రైనింగ్, ఏఐ టెక్నాలజీ, డిజిటల్ రంగాల్లో కూడా యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. చదువుకున్న వారితో పాటు చదువుకోని వారికి కూడా ఉపయోగపడేలా ఈ కేంద్రాల్లో వివిధ వృత్తుల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ నిర్మాణపు పనులు పరిశీలించిన మంత్రి

అనంతరం, మంత్రి ఫరూక్ నెల్లూరు, పరమేశ్వరినగర్‌లో వక్ఫ్ భూమిలో నిర్మాణంలో ఉన్న డా. ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణపు పనులను పరిశీలించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ జెడ్.శివప్రసాద్ పాల్గొన్నారు.

# కాకుపల్లిలో.. 1.45 కోట్లతో అభివృద్ధి పనులు



త్రీఫేస్ కరెంట్ పనులను ప్రారంభిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్ నియోజకవర్గపరిధిలోని కాకుపల్లి గ్రామంలో 1.45 కోట్ల రూపాయల వ్యయంతో చంద్రన్న విద్యుత్ వెలుగులు త్రీఫేస్ కరెంట్ పనులు, సి.సి.రోడ్డు పనులను ఈనెల 2న టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ కోసూరు సుభాషిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సహకారంతో, రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో 370కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

## కమ్యూనిటీ హాల్ ప్రారంభం

అదేవిధంగా, కాకుపల్లి గ్రామ పంచాయితీ స్థలంలో పి4 కార్యక్రమంలో భాగంగా మానుగుంట మోహన్‌రెడ్డి సహకారంతో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ బిల్డింగ్‌ను గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు.


**రెడ్డి వృద్ధాశ్రమం**
**REDDY OLD AGE HOME**
27/1/14, 3వ వీధి - రాంజీనగర్ (చిల్డ్రన్స్ పార్కు సాయిబాబా గుడి ఎదురు వీధి), నెల్లూరు.

**బిరుదవోలు వెంకురెడ్డి**
చైర్మెన్, వృద్ధాశ్రమం కమిటి, సెల్:98850 99885
**అన్నెం సుధాకర్‌రెడ్డి**
వైస్‌చైర్మెన్, సెల్ : 94410 84401
**అనుమారెడ్డి శరత్‌రెడ్డి**
కమిటీ సభ్యులు, సెల్: 93473 55075
**తూపిలి శ్రీధర్‌రెడ్డి**
కమిటీ సభ్యులు, సెల్ : 98666 48284
**శ్రీమతి ఇ.ధనూజరెడ్డి**
కమిటీ సభ్యురాలు, సెల్: 96769 82625


పాపిరెడ్డిపాళెం వాస్తవ్యులు

**కీ॥శే॥ కోడూరు వేంకటరమణారెడ్డి - శ్రీమతి శాంతమ్మల**

స్మృత్యంకంగా... సామాన్యుల కంటి వెలుగు కోసం

**శంకర నేత్రాలయ, శాంతా - వసంతా ట్రస్టు**

# ఉచిత కంటి వైద్య శిబిరం



**• ఫిబ్రవరి 15 నుండి 23 వరకు 9 రోజుల పాటు నిర్వహణ**

*"నేత్రదానం కన్నా మిన్న.. ఉన్న చూపును కాపాడటం." ఈ ఆశయంతోనే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శంకర నేత్రాలయ సంస్థ దాతల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా లక్షలాది మంది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. సాధారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహన లేక, ఆర్థికస్తోమత సరిపోక అధిక సంఖ్యలో కంటి పొరలతో పాటు ఇతర చూపు సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారిని గుర్తించి, వారికి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా శంకర నేత్రాలయ అనేక ఉచిత శిబిరాలను నిర్వహిస్తోంది.*



## కన్నవారినీ.. జన్మభూమినీ స్మరించుకుంటూ!

ఈ బృహత్ కార్యక్రమంలో భాగంగా శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ డాక్టర్ కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డి - శ్రీమతి వసంత దంపతులు తమ స్వగ్రామం పాపిరెడ్డిపాళెంతో పాటు పరిసర గ్రామ ప్రజల నేత్ర సంరక్షణే లక్ష్యంగా మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శంకర నేత్రాలయ కంటి వైద్యశాల – చెన్నై, శాంతా – వసంతా ట్రస్టు – హైదరాబాదు సంయుక్తంగా ఈ ఉచిత కంటి పొర చికిత్స కార్యక్రమాన్ని 9 రోజులపాటు జరుపబోతున్నారు. తమని కన్న అమ్మా, నాన్నలని.. తాము పుట్టిన జన్మభూమిని ఎన్నటికీ మరువకూడదన్న సందేశం ఇస్తూ ఇతరులకి స్ఫూర్తి కలిగించేలా వరప్రసాద్‌రెడ్డి ఈ మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టారు.

తోటపల్లిగూడూరు మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో గల ప్రభుత్వ బీ.సీ.హాస్టల్ ప్రాంగణంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నుండి 23వ తేదీ వరకు 9 రోజులపాటు, దాదాపు 3వేలమందికి అవసరమైన పరీక్షలు జరిపి, ఇదే శిబిరంలో చివరి 5 రోజులు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా చేస్తారు. రోగికి కావలసిన మందులతో పాటు కంటి అద్దాలని కూడా ఉచితంగానే అందివ్వనున్నారు.

## ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యం!

అత్యాధునిక పరికరాలతో కూడిన సంచార వాహనాల ద్వారా గ్రామాల వద్దకే వెళ్లి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం. కంటి పొరలు ఉన్నట్లు గుర్తించిన రోగులకు అదే శిబిరంలో ఎటువంటి ఖర్చు లేకుండా శస్త్రచికిత్స చేసి అవసరమైన లెన్స్‌లు అమర్చడం. దూర ప్రాంతాల నుండి వచ్చే రోగులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించడం. మధుమేహం (Diabetes) ఉన్నవారిలో వచ్చే కంటి సమస్యల (Diabetic Retinopathy)పై ప్రత్యేక అవగాహన కల్పించడం.

## కంటి పొరలు ఆధునిక చికిత్స!

కంటిలోని సహజసిద్ధమైన లెన్స్ (Lens) మసకబారడాన్నే 'కంటి పొర' లేదా 'కాటరాక్ట్' అంటారు. ఇది సాధారణంగా 50 ఏళ్లు దాటిన వారిలో కనిపిస్తుంది. అయితే, ఆధునిక వైద్యం ఇప్పుడు ఈ సమస్యను చాలా సులభంగా, నొప్పి లేకుండా పరిష్కరిస్తోంది.

శంకర నేత్రాలయ వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థలు కంటి వైద్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. వీరు ఉచితంగా పేదవారికి కూడా అత్యాధునిక చికిత్సను అందిస్తున్నారు.

## ఆపరేషన్ విధానాలు!

ప్రస్తుతం కంటి పొర చికిత్సలో ప్రధానంగా రెండు రకాల పద్ధతులు వాడుకలో ఉన్నాయి. మొదటిది ఫాకో ఎమల్సిఫికేషన్, ఇది అత్యంత ఆధునిక పద్ధతి. ఇందులో కుట్లు ఉండవు. అల్ట్రాసోనిక్ తరంగాల ద్వారా మసకబారిన పొరను కరిగించి తీసివేస్తారు. దాని స్థానంలో 'ఫోల్డబుల్ లెన్స్'ను అమరుస్తారు. ఇది చాలా చిన్న రంధ్రం ద్వారా జరుగుతుంది కాబట్టి గాయం త్వరగా మానిపోతుంది. రెండవది లేజర్ కాటరాక్ట్ సర్జరీ. ఇది మరింత ఖచ్చితత్వంతో కూడిన పద్ధతి. బ్లేడ్ వాడకం లేకుండా లేజర్ సాయంతో ఆపరేషన్ చేస్తారు.

"కంటి చూపు మనిషికి దేవుడు ఇచ్చిన అతిపెద్ద వరం." కంటి పొరలు వచ్చాయని భయపడకుండా పరీక్షలు చేయించుకుని, సకాలంలో ఆపరేషన్ చేయించుకుంటే మళ్ళీ ప్రపంచాన్ని స్పష్టంగా చూడవచ్చు.

## గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి!

డబ్బు లేని కారణంతో ఎవరూ చూపు కోల్పోకూడదనే ఉదాత్తమైన భావంతో గ్రామీణ ప్రాంత ప్రజల సౌలభ్యం కోసం శంకర నేత్రాలయ, శాంతా – వసంతా ట్రస్టు సంయుక్తంగా ఈ ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని పేద ప్రజలకు, వృద్ధులకు ఈ సమాచారాన్ని చేరవేసి, ఉచిత సేవలని సద్వినియోగం చేసుకునేలా తోటపల్లి గూడూరు పరిసర ప్రాంత ప్రజలకి చైతన్యం కల్పించాలని నిర్వాహకులు పిలుపునిస్తున్నారు.

# కార్పొరేషన్‌కి..కొత్త ఆరోగ్యాధికారి


డాక్టర్ దినేష్

నెల్లూరు నగరపాలక సంస్థకి ఆరోగ్య అధికారిగా డాక్టర్ దినేష్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 3న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశంజిల్లా వలేటి వారిపాలెంలో పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఉన్న ఆయన్ను, నెల్లూరులో నియమిస్తూ, ఇక్కడ ఆ స్థానంలో ఉన్న డాక్టర్ కనకాద్రిని మాతృశాఖ.. వైద్యఆరోగ్యశాఖకి బదిలీచేస్తూ ఆదేశాలు వచ్చాయి.

# స్పాస్టిక్ సెంటర్‌లో..బాపూజీకి నివాళులు


గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

జనవరి 30న జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో జిల్లా రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, స్పాస్టిక్ సెంటర్ కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గాంధీజీ ఆలోచనలు, సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయని, గాంధీజీ తన అహింసా సిద్ధాంత బలంతో బ్రిటీష్ పాలకులను ఎదిరించి దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చారని ఆయన కొనియాడారు. ప్రిన్సిపల్ ఉదయ్‌భాస్కర్, రెడ్ క్రాస్ సెక్రటరీ మస్తానయ్య స్పాస్టిక్ సెంటర్ చిన్నారులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బలరామయ్యనాయుడు@69


నలుబోలు బలరామయ్యనాయుడు దంపతులను సత్కరిస్తున్న వాకర్స్‌ప్రతినిధులు

నలుబోలు బలరామయ్యనాయుడంటే అందరికీ సుపరిచితులే. వాకర్స్ ప్రతినిధిగానే కాక, ఇటీవలే ఆయన 203-వాకర్స్ జిల్లా గవర్నర్ కూడా అయ్యారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్‌కి ఆయన వెన్నుదన్నుగా ఉంటూ ఎప్పుడూ ఏదో ఒక సేవా కార్యక్రమం చేయడం ఆయనకు నిత్యకృత్యం. ఫిబ్రవరి 3న ఆయన పుట్టినరోజు. 69వ జన్మదినం సందర్భంగా ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. కేకు కట్ చేసి బర్త్‌డే శుభాకాంక్షలు చెప్పారు. బలరామయ్య నాయుడును, ఆయన సతీమణి పద్మావతిని వాకర్స్ ప్రతినిధులు, వివేకానంద వాకర్స్ అసోసియేషన్, ఏసిఎస్ వాకర్స్ అసోసియేషన్, ఈవినింగ్ వాకర్స్ అసోసియేషన్, స్మైల్ వాకర్స్, ఏసీ మహిళా వాకర్స్ సంఘాల సభ్యులు పాల్గొని సన్మానించారు. బలరామయ్య నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్ అహమద్, కార్యదర్శి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

# 'ప్రజాదర్బార్' అర్జీలను పరిష్కరిస్తాం

## -- ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ --


'ప్రజాదర్బార్'లో అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

నెల్లూరు నగర నియోజకవర్గంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్'కు ప్రజల నుంచి వస్తున్న అర్జీలను వీలైనంత వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ చెప్పారు. ఈనెల 3న నగరంలోని 3వ డివిజన్ మధురానగర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నెల్లూరు నగర నియోజకవర్గాన్ని నాలుగు జోన్లుగా విభజించి నలుగురు స్పెషల్ ఆఫీసర్లను ప్రజాదర్బార్ నిర్వహణకు ప్రత్యేకంగా నియమించామని, ప్రజాదర్బార్ కార్యక్రమంలో అందుకున్న వినతులను అత్యంత పారదర్శకంగా, నిర్దేశించిన సమయంలో పరిష్కరించేందుకు స్వయంగా మంత్రి నారాయణ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

# పెద్దాసుపత్రిలో త్వరలో హెర్బల్ పార్కు

## ఔషధ మొక్కల బోర్డు సీఇఓ వెల్లడి


ప్రభుత్వాసుపత్రిలో స్థలాలను పరిశీలిస్తున్న ఔషధ మొక్క సిఈఓ చంద్రశేఖర్

ఆసుపత్రుల్లో ఉన్న రోగులకు మానసిక ఉల్లాసం కోసం ప్రభుత్వం హెర్బల్ పార్కుల ఏర్పాటుకు సంకల్పించింది. ఏపీ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ ఆ విషయం చెప్పారు. ఈనెల 3న ఆయన నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని, వైద్య కళాశాలను సందర్శించి, ఔషధ మొక్కల పెంపకానికి అనువైన స్థలాలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రి ప్రాంగణంలో హెర్బల్ పార్కుతో పాటు, వాకింగ్ ట్రాక్, సీటింగ్ బెంచీలు, పూలమొక్కలు, తాగునీటి వసతి వగైరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం ప్రభుత్వ నిధులతో పాటు, పారిశ్రామికవేత్తలు, దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా తీసుకుంటామని, హెర్బల్ పార్కుల ఏర్పాటుకు దాతలు దత్తత తీసుకోవచ్చని తెలిపారు.

# పరీక్షల ఫీజును..20లోగా చెల్లించాలి

ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల డిప్లొమా కోర్సుల పరీక్ష ఫీజును ఈనెల 20వతేదీ లోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

# 12న సార్వత్రిక సమ్మె

లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలుచేయాలని కోరుతూ ఈనెల 2న నెల్లూరులోని సీపీఎం, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు. నగరంలోని ముత్తుకూరుగేట్ కూడలి వద్ద జరిగిన ఈ ఆందోళనలో భవన నిర్మాణ కార్మికసంఘం నగర కార్యదర్శి.. సీపీఎం నాయకుడు ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ, కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రప్రభుత్వం లేబర్‌కోడ్‌ని తీసుకువచ్చి, కార్పొరేట్ సంస్థలకు కార్మికులను బానిసలుగా చేస్తున్నారంటూ వారు విమర్శించారు.

# శ్రీధర్‌రెడ్డితో..జనసేన నాయకుల భేటీ


కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న జనసేన నాయకులు

ఇటీవల వైద్య చికిత్సల కోసం వెళ్ళి నెలరోజుల పాటు విరామం అనంతరం, తిరిగి నెల్లూరుకు వచ్చిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఈనెల 3న జనసేన నాయకులు గునుకుల కిషోర్, ప్రశాంత్ గౌడ్, శరవణ, నరహరి, తరుణ్‌ప్రతాప్, షాజహాన్ తదితరులు కలుసుకుని ఆత్మీయంగా సన్మానించారు. శ్రీధర్‌రెడ్డి ప్రజలసేవలో మరింత ఉత్సాహంగా సాగాలని వారు ఆకాంక్షించారు.

## 'రెయిన్‌బో స్కూల్'

# పద్మా సుబ్రహ్మణ్యంకి..అవార్డు



'ఇంపాక్ట్‌ఫుల్ లీడర్' అవార్డును అందుకుంటున్న పద్మా సుబ్రహ్మణ్యం

నెల్లూరు ధనలక్ష్మీపురంలో ఉన్న రెయిన్‌బో స్కూల్ డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యంకి ప్రతిష్టాత్మకమైన 'ఇంపాక్ట్‌ఫుల్ లీడర్' అవార్డు లభించింది. చెన్నైలో ఐపీఎన్, అమృత విశ్వవిద్యాపీఠం వారు ఇటీవల నిర్వహించిన ఇంపాక్ట్‌ఫుల్ స్కూల్ లీడర్‌షిప్ సదస్సులో అమృత సంస్థ డైరెక్టర్ మహేశ్వర్ చైతన్య, ఐపీఎన్ ఫౌండర్ గౌరవ్‌యాదవ్‌ల చేతులమీదుగా ఆమె ఆ అవార్డును అందుకున్నారు. పాఠశాల అభివృద్ధి, ఉపాధ్యాయుల సామర్థ్యం, విద్యార్థుల అభ్యసన ఫలితాల్లో మంచి మార్పులు తీసుకురావడంతో పాటు, ప్రతిభావంతంగా పాఠశాలను తీర్చిదిద్దడంలో నాయకత్వ పటిమ కలిగిన పద్మా సుబ్రహ్మణ్యంకి ఆ అవార్డును బహుకరించారు.

# నవజాత శిశు సంరక్షణ కేంద్రం పునఃప్రారంభం


నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పి.టి.జగన్నాథం, డా. మాధవి

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (పెద్దాసుపత్రి)లోని పురిటి పిల్లల విభాగంలో నవజాత శిశు సంరక్షణ కేంద్రం-2ను ఇటీవల ఆధునీకరించి పునఃప్రారంభించారు. పీటీజీ గ్రూప్ అధినేత పీటీ జగన్నాథం అందించిన నిధులతో కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ, 'నవజాత శిశు సంరక్షణ కేంద్రం'ను అభివృద్ధిచేసి పునఃప్రారంభించడం ద్వారా పురిటి పిల్లల విభాగంలో ఉన్న అనేక నవజాత శిశువులకు సక్రమ వైద్యం అందించగలుగుతామన్నారు. పురిటి పిల్లల విభాగం హెచ్‌ఓడీ రామ్‌కిషోర్, ఎస్‌ఎన్‌సీయు నోడల్ ఆఫీసర్ డాక్టర్ శివరాముడు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో..

# సత్యనారాయణస్వామి వ్రతం



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో ఫిబ్రవరి 1న మాఘ పౌర్ణమి సందర్భంగా ఆలయంలోని అనివెట్టి మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. సత్యనారాయణస్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణలు నిర్వహించి పూజలు చేశారు.

## మంత్రి నారాయణ చొరవతో.. 11.75 కోట్లతో..

# నగర రోడ్లకు మహర్దశ



సిమెంటురోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మంత్రి నారాయణ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ఇటీవల ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 45వ డివిజన్ రామ్మూర్తినగర్‌లో కోటి 7లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ఎండ్-టు-ఎండ్ రోడ్డు పనులకు మంత్రి నారాయణ శంకుస్థాపన చేశారు. అనంతరం రంగనాయకులపేట గాలిగోపురం వద్ద జరుగుతున్న ఆధునీకరణ పనులు, మూలాపేటలో రామిరెడ్డి కాలువ ఆధునీకరణ పనులను ఆయన స్వయంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం, మంత్రి మాట్లాడుతూ.. నెల్లూరు నగరాన్ని దుమ్ము లేని నగరంగా మారుస్తామని, నగరం మొత్తమ్మీద 96 ప్రాంతాల్లో 11కోట్ల 75 లక్షల రూపాయలతో రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.

### పిఎంఆర్ హైస్కూల్‌లో... అదనపు భవనాలు

నెల్లూరులోని పిఎంఆర్ హైస్కూలులో అదనపు భవనాల నిర్మాణాలకు ఇటీవల మంత్రి నారాయణ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'తాను పేదరికాన్ని జయించి ఈ స్థాయికి రావడానికి చదువే ప్రధాన కారణమని' తెలిపారు. ఇప్పటికే వీఆర్ హైస్కూల్‌ను రూ.15 కోట్లతో అద్భుతంగా తీర్చిదిద్దామని, వక్ఫ్ స్థలంలో మరో 20 కోట్లతో అత్యాధునిక పాఠశాలను నిర్మిస్తున్నామని వివరించారు. భవనాల నిర్మాణానికి చేయూతనందించిన ప్రియా ఇంజినీరింగ్ అధినేత శ్రీనివాసులురెడ్డిని, పూర్వ విద్యార్థులు రంగా, శివకుమార్‌లను మంత్రి అభినందించారు.

### ఈ-ట్రాక్టర్‌ను నడిపిన మంత్రి



నగర ప్రజల తాగునీటి అవసరాలను తీర్చే క్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ మరో కీలక అడుగు వేసింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన 'మొంత్రా ఈ-ట్రాక్టర్' మంచినీటి ట్యాంకర్ వాహనానికి రంగనాయకులపేటలో మంత్రి నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి నారాయణ స్వయంగా డ్రైవర్ సీటులో కూర్చుని, వాటర్ ట్యాంకర్ అనుసంధానించిన ఈ-ట్రాక్టర్‌ను నడిపి అందరినీ ఉత్సాహపరిచారు. సుమారు 12 లక్షలతో ఈ ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌ను కొనుగోలు చేయడం జరిగిందన్నారు.

# సతీష్‌రెడ్డి సేవలు అభినందనీయం

## మంత్రి ఆనం ప్రశంస



కంటి శస్త్ర చికిత్స మొబైల్ యూనిట్ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, గుండ్రా సతీష్‌రెడ్డి

పేదలకు మెరుగైన కంటి చూపు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల సోమశిలలో సతీష్‌రెడ్డి నేతృత్వంలో హెల్పింగ్ హార్ట్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శస్త్ర చికిత్స మొబైల్ బస్సు యూనిట్లను మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో సోమశిలలో మూడు రోజుల పాటు పేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి, కంటి సమస్యలున్నవారికి మెరుగైన కంటిచూపు అందించేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఇటీవల ఆత్మకూరులో గుండ్రా సతీష్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళా ద్వారా సుమారు 600 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం సంతోషకరమని తెలిపారు. మెట్ట ప్రాంత అభివృద్ధికి సతీష్‌రెడ్డి చేస్తున్న సేవలు అమోఘమని మంత్రి ప్రశంసించారు. ఆర్డీవో పావని, తాళ్లూరి గిరినాయుడు, స్థానిక నేతలు రమణారెడ్డి, లక్ష్మీరెడ్డి, శంకర్ నేత్రాలయ సభ్యులు రంజిత్, వైద్యులు గజేంద్ర కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

### సోమశిలలో టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తాం :

సోమశిలను పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం స్పష్టం చేశారు. త్వరలోనే ఆప్రాన్, హైలెవల్ కెనాల్ పనులు ప్రారంభిస్తామని, సోమశిలలో బోటింగ్, అతిథి భవనాలు, హోటళ్ల నిర్మాణాల కోసం పర్యాటక శాఖ అధికారులతో కలిసి త్వరలో పర్యటిస్తామని అన్నారు. సోమేశ్వరాలయాన్ని పూర్తి చేసి పెంచలకోనతో అనుసంధానం చేసి టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.




10వ వర్ధంతి

నిష్కల్మష హృదయుడు, నిస్వార్థ సేవాతత్పరుడు,
నిరంతర ప్రజాసేవకుడు, అజాతశత్రువు

**చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు**

(మాజీ వైస్ ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)

పరమపదించి తేది. 9.2.2026 నాటికి పదేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

బావమరిది / అల్లుడు - కుమార్తె
ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై
మనుమడు - మనుమరాలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై
మనుమరాలు - మనుమడు
శ్రీమతి హరిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ
మునిమనుమలు మునిమనుమరాండ్రు
జయేష్ & అష్మిత ఆకాష్ కీర్తన లక్ష్మి & తనవ్

## స్వర దీపికలు.. విద్యా వీచికలు.. వర పుత్రికలు..!

# సర్వేపల్లి సిస్టర్స్‌కి.. ‘స్వర రాగమయి’ బిరుదుతో సత్కారం



సర్వేపల్లి సిస్టర్స్‌కి సన్మానపత్రాన్ని అందజేస్తున్న తుంగా శివప్రభాత్‌రెడ్డి, వీరిశెట్టి హాజరత్‌బాబు



తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చిన సర్వేపల్లి సోదరీమణులని గజమాలతో సత్కరిస్తున్న విశ్వసాయి విద్యాసంస్థల సారధి సత్యనారాయణ, రత్నం విద్యాసంస్థల డైరెక్టర్ డా. కే.కృష్ణకిషోర్

***ఓ వైపు అపార సంగీత జ్ఞానం.. మరోవైపు అపురూప వైద్య విజ్ఞానం. ఆ రెండిటికీ సమపాళ్లలో న్యాయం చేస్తున్న మేధో మాలికలు ఆ బాలికలు అంటూ సర్వేపల్లి సిస్టర్స్ శ్రేయ, రాజలక్ష్మిలపై వక్తలు పొగడ్తల వర్షం కురిపించారు. ఫిబ్రవరి 1వ తేదీ నెల్లూరు పురమందిరం ఆ అక్క చెల్లెళ్ళకి అభినందల వేదికగా మారింది. కళాంజలి అనంత్, లక్ష్మీ ప్రసన్న, క్లాసిక్ గ్రాఫిక్స్ అధినేత విష్ణువర్ధన్‌రెడ్డిల నేతృత్వంలో జరిగిన ఆత్మీయ వేడుకలో ఆ ఇద్దరికీ “స్వరరాగమయి” అన్న బిరుదుతో సత్కారం జరిగింది.***

రోటరీ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, రెడ్ క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, విశ్వసాయి విద్యాసంస్థల సారధి డాక్టర్ ఎన్.సత్యనారాయణ, మురళీకృష్ణ సంస్థల పూర్వ నిర్వాహకులు వీరిశెట్టి హాజరత్‌బాబు, ఆర్కా కంటి వైద్యశాల అధిపతి డాక్టర్ ఓ.గోపాల కృష్ణ, ‘లాయర్’ పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, డాక్టర్ కిషోర్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ కృష్ణ కిషోర్ ముఖ్యఅతిథిలుగా ఆనాటి వేడుక రసభరితంగా జరిగింది. ఈ సంతోష సంబరంలో సర్వేపల్లి సిస్టర్స్‌గా సంగీత సామ్రాజ్యంలో ప్రాచుర్యం పొందిన సర్వేపల్లి శ్రేయ, రాజలక్ష్మిలని ప్రధాన అతిథులందరూ ఘనంగా సత్కరించి అక్క చెల్లెళ్లకి “స్వర రాగమయి” అన్న బిరుదుని ప్రదానం చేశారు.

ఈ మధుర తరుణంలో జరిగిన సభలో ముందుగా తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ సంగీతంతో పాటు విద్యకి కూడా సమాన ప్రాధాన్యతని ఇచ్చి వైద్య పట్టా పుచ్చుకోవడం సామాన్యమైన విషయం కాదన్నారు. తమ చిన్నారుల అభిరుచిని, ఆసక్తిని గమనించి శ్రేయ, రాజలక్ష్మిలని ప్రోత్సహించిన వారి అమ్మానాన్నలు డాక్టర్ అజయ్‌కుమార్ – శ్రీమతి శారదాదేవిలని ఆయన అభినందించారు.

శ్రేయ, రాజలక్ష్మిలని చిన్నతనం నుండీ చూస్తున్నానని, సంగీతం పట్ల వారిద్దరికి వున్న ఆసక్తి వారిని ఈరోజు ఏకంగా నందమూరి బాలకృష్ణ అఖండ–2 సినిమాలో పాడే స్థాయికి తీసుకెళ్లిందని వాకాటి విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. భవిష్యత్తులో వారు మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన ఆశీర్వదించారు.

దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంస్కృతీ, సంప్రదాయాలకి నిలయం మన భారతదేశమన్నారు. చదువుకోవడానికి తప్ప మాకు మరే ఇతర పనులకి టైంలేదని చెప్తున్న ఈ తరంలో అటు చదువుకి, ఇటు సంగీతానికి సమ న్యాయం చేసిన సర్వేపల్లి సిస్టర్స్ అభినందనీయులని అన్నారు. భవిష్యత్ తరాలకి మార్గదర్శకులుగా వీళ్ళిద్దరినీ ఉదాహరణగా పేర్కొన్నారు.

తాను పాఠాలే చెప్పానని.. కానీ శ్రేయ, రాజలక్ష్మి పాటలు కూడా నేర్చుకోవడం అనితర సాధ్యం అని సత్యనారాయణ వారిని అభినందించారు.

డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ ఈ జ్ఞాన కోకిలల పాదముద్రలు తమ పాఠశాలలో పడినందుకు గర్విస్తున్నానని అన్నారు.

డాక్టర్ గోపాలకృష్ణ శ్రేయ, రాజలక్ష్మిలతో చిన్నతనం నుండి తనకున్న కుటుంబ అనుబంధాన్ని గుర్తు చేసుకుని సిస్టర్స్‌ని ఆశీర్వదించారు.

రెండు రంగాలకి సమపాళ్లలో న్యాయం చేయడం అసాధ్యమైన విషయమని, ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం శ్రేయ, రాజలక్ష్మిలకే దక్కిందని అంటూ వీరిశెట్టి హాజరత్‌బాబు ఆ గానజ్ఞానులకి తమ ఆశీస్సులు అందించారు.

తమకి జరిగిన సత్కారానికి స్పందించిన శ్రేయ, రాజలక్ష్మి మాట్లాడుతూ తమని నిరంతరం ప్రోత్సహించిన తమ గురువుకి, శ్రేయోభిలాషులకి, సంగీతప్రియులకి, తమ అమ్మానాన్నలకి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో సంగీత, వైద్య రంగాలలో రాణిస్తామని చెప్పారు. సత్కార సభా కార్యక్రమానికి ముందు జరిగిన పాటల సందడి సభికులని అలరించింది. గురుకృప విద్యార్థినుల నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దువ్వూరు బెనర్జీ, కిషోర్ వ్యాఖ్యానంలో క్లాసిక్ గ్రాఫిక్స్ విష్ణు, కళాంజలి అనంత్‌ల పర్యవేక్షణలో కార్యక్రమం ఆసాంతం ఆహ్లాదంగా సాగింది.



శ్రేయ - రాజలక్ష్మిల ఆత్మీయ పురస్కార సభలో పాల్గొన్న ముఖ్యఅతిథులు, కార్యక్రమ నిర్వాహకులు

---

# గూడూరు డివిజన్

## రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ


రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లను అందజేస్తున్న తహశీల్దార్ ఆర్.వి.ప్రసాద్

గూడూరు మండల పరిధిలోని కొమ్మనేటూరు గ్రామంలో రీసర్వే చేసిన భూములకు గూడూరు తహశీల్దార్ ఆర్.వి.ప్రసాద్ చేతుల మీదుగా రైతులకు ఇటీవల పాస్ బుక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమ్మనేటూరు గ్రామానికి చెందిన రైతులకు 176 పాస్‌బుక్‌లను అందచేయడం జరిగిందన్నారు. త్వరలో మిగతా గ్రామాలకు సంబంధించిన పాస్‌బుక్‌లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్వో వెంకటరమణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గూడూరులోని పొనక వెంకురెడ్డి కల్యాణమండపంలో ఇటీవల జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో చిల్లకూరు తహశీల్దార్ శ్రీనివాసులును సన్మానిస్తున్న గూడూరు శాసనసభ్యులు డా. పాశం సునీల్‌కుమార్, పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మెన్ తానంకి నానాజీ తదితరులు.

## క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు


డాక్టర్ మనోభిరామ్‌ని సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గూడూరు రోటరీ క్లబ్ వారు ఈ నెల 3వ తేదీ ఏఏ రెడ్డి రోటరీ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. నారాయణ మెడికల్ కాలేజీ మరియు క్యాన్సర్ ఆసుపత్రి డాక్టర్ జి.మనోభిరామ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీ నుండి మార్చి 4వతేదీ వరకు స్త్రీ, పురుషులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతోందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లురెడ్డి, కార్యదర్శి మల్లు విజయకుమార్‌రెడ్డి, కె.మునిగిరీష్, బి.దశరథ రామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకంటికి ప్రశంసా పత్రం




యస్.వి. రత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమర్థవంతంగా పవిత్రభావంతో సేవలను నిర్వహించినందుకుగాను ట్రస్టు ఛైర్మెన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు – రాజ్యలక్ష్మి దంపతుల సేవలను గుర్తించి, గూడూరులో జరిగిన 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వారికి ప్రభుత్వాధికారులు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

## వైజేపీ లయన్స్ సేవా కార్యక్రమాలు


గోపాలకృష్ణని సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ టౌన్ మరియు వెస్ట్‌క్లబ్ సేవా కార్యక్రమాల జిల్లా అధికార పర్యటన నిమిత్తం ఈ నెల 3వ తేదీ 316–జె డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.ఎం.జె.ఎఫ్ లయన్ గోపాల కృష్ణ దంపతులు విచ్చేసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లయన్స్ ప్రతినిధులు ఆర్.వీ.రావు, వై.గురునాథం, పి.శ్రీరాములు, వి.రామానుజం, డా॥ కృష్ణమూర్తి, ఐ.ప్రసాద్, వి.చంద్రశేఖర్‌రెడ్డి, వెంకయ్య, గోపినాథ్, రవీంద్రరెడ్డి, మురళిరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వర్ణాంధ్ర భారతి విద్యార్థుల ప్రతిభ


కాంస్య పతకాలతో శ్రీ స్వర్ణాంధ్ర బారతి విద్యార్థినులు

గూడూరు, మాలవ్యనగర్‌లో శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు వై.హస్మిత, ఏ.సాయి ఐశ్వర్య, సి.హెచ్.కీర్తన, ఆర్.హర్షిణి, ఎన్.నదిరాలు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 26వ జాతీయస్థాయి కరాటే స్క్వాయి ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొన్నారు. హస్మిత, ఐశ్వర్య, కీర్తనలు కాంస్య పతకాలు సాధించి జూన్‌లో జమ్మూ కాశ్మీర్‌లో జరగబోయే అంతర్జాతీయ పోటీలకి అర్హత సాధించారు.

## శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో..ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థులకు

# జ్ఞాపకశక్తి, ఏకాగ్రతలపై అవగాహన




ఇరుగుళం స్కూల్లో శ్రీసిటీ ఫౌండేషన్, మ్యాక్స్ అకాడమీ బృందం

తమ సీఎస్సార్ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ స్కూళ్ల విద్యా ప్రమాణాల పెంపుకు పెద్దపీట వేస్తున్న శ్రీసిటీ ఫౌండేషన్, విద్యార్థులలో స్మార్ట్ స్కిల్స్ పెంపొందించేందుకు తాజాగా మరో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంచే మెళకువలు, సులువుగా, క్రమబద్ధంగా, వేగంగా చదివే పద్ధతులు, చక్కని చేతివ్రాత, పరీక్షలు వ్రాసే నైపుణ్యాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మ్యాక్స్ అకాడమీ సంస్థ భాగస్వామ్యంతో సత్యవేడు మండలంలోని ఇరుగుళం, మాదనపాలెం జడ్పీ హైస్కూళ్లలో గత ఏడాది నవంబర్ 18 నుంచి 2026 జనవరి 30 వరకు 6 సెషన్స్‌లో శిక్షణ అందచేసింది. ప్రఖ్యాత విద్యానైపుణ్యాల మరియు వ్యక్తిత్వ వికాస ట్రైనర్, మ్యాక్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జెఎన్‌రెడ్డి బృందం వారు ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణతో పాటు శ్రీసిటీ సౌజన్యంతో మ్యాక్స్ అకాడమీ రూపొందించిన 'సులువుగా చదువు', 'చదువులో రాణించు', 'శిధిలాల నుంచి శిఖరాగ్రాల వరకు' పేర్లతో కలిగిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. 6 నుంచి 10వ తరగతికి చెందిన సుమారు 400 మంది విద్యార్థులు ఈ శిక్షణ పొందారు. కేవలం ఐఐటీ, ఐఐఎం మరియు కార్పొరేట్ విద్యాసంస్థలకే అందుబాటులో వుండే ఈ తరహా శిక్షణా కార్యక్రమాన్ని గ్రామీణ ప్రభుత్వ విద్యార్థులకు చేరువ చేసిన శ్రీసిటీ ఫౌండేషన్ చొరవను జెఎన్ రెడ్డి ఈ సందర్భంగా ప్రశంసించారు. తాను కూడా ఈ ప్రాంతవాసిగా ఇందులో భాగస్వామి కావడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. జెఎన్‌రెడ్డి బృందానికి కృతజ్ఞతలు తెలిపిన శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి, ఈ కార్యక్రమం విద్యార్థుల విద్యానైపుణ్యాలతో పాటు వారి వ్యక్తిత్వ వికాసవృద్ధికి ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఈ శిక్షణలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడమే కాక, తాము నేర్చుకున్న జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను డెమో ద్వారా వ్యక్త పరుస్తూ అబ్బురపరిచారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ఫౌండేషన్ చొరవను పాఠశాలల ఉపాధ్యాయులు ప్రశంసించారు.

# ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయి.. ప్రజలకు చేరాలి

**• శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ ఛైర్మెన్ జోగేశ్వరరావు**



సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ ఛైర్మెన్ జోగేశ్వరరావు

ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయిస్తున్న ప్రతి రూపాయి కూడా ప్రజలకు చేరువ చేయడమే ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ ప్రధాన లక్ష్యమని కమిటీ ఛైర్మెన్ వి.జోగేశ్వరరావు చెప్పారు. ఈనెల 3న నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎస్టిమేట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిటీ ఛైర్మెన్ జోగేశ్వరరావుతో పాటు సభ్యులు మద్దిపాటి వెంకటరాజు, పాశం సునీల్ కుమార్, వి.వి.సూర్యనారాయణరాజు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ సెక్రటరీ భిక్షం, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, జిల్లాలో శాఖల వారీగా ఎంత బడ్జెట్ విడుదలైంది, ఎంత మేర ఖర్చు జరిగింది అనే అంశాలపై సమగ్రంగా కమిటీ అధ్యయనం చేస్తుందన్నారు. జిల్లాలో ఏ పథకానికి ఎక్కువ డిమాండ్ ఉందో గుర్తించి, ఆ పథకానికి అధికంగా నిధులు విడుదల అయ్యేలా ఎస్టిమేట్స్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. అనంతరం, జోగేశ్వరరావు మాట్లాడుతూ, జిల్లాలో బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై సమగ్ర వివరాలతో బుక్‌లెట్ తయారు చేయడం పట్ల కలెక్టర్ హిమాన్షు శుక్లను అభినందించారు. సమావేశంలో పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, పాఠశాల భవనాల పరిస్థితి సంతృప్తికరంగా లేదన్న అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పరిశీలించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఎన్‌బీకేఆర్‌లో విద్యార్థులకు వర్క్‌షాప్

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ మరియు విఎల్ఎస్ఇ రంగాలలో అవగాహనను పెంపొందించేందుకు 'కౌడెన్స్ ఉపయోగించి అనలాగ్ డిజైన్ మౌలికసూత్రాలు' అనే అంశంపై ఇటీవల వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన భారత్ సిమీ సిస్టమ్స్ సీనియర్ స్టాఫ్ మేనేజర్ డా. కె.వాసుదేవరెడ్డి పాల్గొని అనలాగ్ డిజైన్ ప్రాముఖ్యతను వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆ సంస్థ ప్రతినిధులైన డా.కె.హరికిషోర్, బినయ్‌కుమార్‌పాల్‌ల సహకారంతో 3వ సంవత్సరం బీటెక్, ఇసిఇ విద్యార్థులకు ప్రత్యక్ష ప్రాయోగిక అనుభవంతో కూడిన శిక్షణ అందిస్తారని తెలిపారు,. ఆధునిక ఇంజనీరింగ్ విద్యలో సమస్య పరిష్కార దృక్పథం ఎంతో కీలకమని, సబ్జెక్టులలో స్పష్టత ఉన్నప్పుడే ఆవిష్కరణలకు మార్గం ఏర్పడుతుందని ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డా.వి.విజయకుమార్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. డిజైన్ ఆలోచనలను స్వయంగా చేయగలిగినప్పుడే పరిణతి పొందుతారన్నారు. కార్యక్రమం సమన్వయకర్త కె. చంద్రశేఖర్, ఇసిఇ విభాగాధిపతులు కె. నాగిరెడ్డి, డా.ఎస్‌కె మహబూబ్‌బాషా, ప్రిన్సిపాల్ డా.ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ కేంద్రాలకి..రిజిస్ట్రేషన్ ఉండాలి

జిల్లాలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలకి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఉండాలని ఆ కేంద్రాల పర్యవేక్షణాధికారి ఫరూక్‌బాషా ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన వారు ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### సమస్యల సాధనకు..

## వడ్డెరల ర్యాలీ

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ కోర్కెలను ప్రభుత్వం ఇకనైనా పట్టించుకోవాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలవుతున్నా వడ్డెరలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ఇకనైనా తమకు న్యాయం చేయాలంటూ వడ్డెర వృత్తిదారులు ఈనెల 2న నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. తొలుత స్థానిక వీఆర్‌సీ కూడలి వద్దనున్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకి ఆమేరకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు కె.వెంకటేష్, నాయకులు రాంప్రసాద్, వెంకయ్య, మల్లి, నాగార్జున్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మన శక్తిసామర్థ్యాలే.. మన బలాలు!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

***విద్యార్థి జీవితంలో అత్యంత ముఖ్యమైన ప్రశ్నల్లో ఒకటి 'నేను ఏ విషయంలో బలంగా ఉన్నాను?'.. అనే ప్రశ్న. మార్కులు, ర్యాంకులు, పరీక్షలు ఇవన్నీ విద్యార్థి సామర్థ్యాన్ని కొంతవరకే చూపిస్తాయి. కానీ మనలో దాగి ఉన్న సహజ ప్రతిభలు, ఆసక్తులు, విలువలు, మనసు లాగే దిశ..ఇవే నిజమైన బలాలు. అవే మన శక్తి సామర్థ్యాలు. వాటిని ముందుగానే గుర్తించిన విద్యార్థి, జీవితంలో స్పష్టమైన దారిని ఎంచుకుంటాడు. ఈ వారం మనం మాట్లాడేది అదే: తన బలాలను ఎలా కనుగొనాలి, వాటిని ఎలా పెంపొందించాలి, వాటి ఆధారంగా భవిష్యత్తును ఎలా నిర్మించాలి!... అనే విషయాలు తెలుసుకుందాం!***

ప్రతి విద్యార్థిలో ఒక ప్రత్యేక దీప్తి ఉంటుంది. ఒకే తరగతి గదిలో చదివే నలభై మంది పిల్లల్లో ప్రతిఒక్కరి లోపల ఒక విశేష శక్తి దాగి ఉంటుంది. కొందరికి గణితం సహజంగా అర్థమవుతుంది, మరికొందరికి భాషలు సులభంగా జీర్ణమవుతాయి, ఇంకొందరికి చిత్రలేఖనం, సంగీతం, క్రీడలు, నాయకత్వం, పరిశీలన.. ఇలా ఒక్కొక్కరి బలం ఒక్కోలా ఉంటుంది. ఒక ప్రభుత్వ పాఠశాలలో చదివే రమ్య.. చదువులో సగటు విద్యార్థిని. కానీ చిన్నప్పటి నుంచే పిల్లలతో మాట్లాడటం, వారికి సహాయం చేయడం అంటే ఆమెకు ఎంతో ఇష్టం. ఉపాధ్యాయులు ఆమెను తరగతి ప్రతినిధిగా పెట్టినప్పుడు ఆమెలోని నాయకత్వం వెలుగులోకి వచ్చింది. ఈరోజు రమ్య సోషల్ వర్క్ చదువుతోంది. ఎందుకంటే ఆమె తన శక్తిసామర్థ్యాలను "మనుషులతో పనిచేయడం"గా గుర్తించింది. బలం అనేది ఎప్పుడూ మార్కులలో కనిపించదు, అది మన ప్రవర్తనలో, మన స్పందనలో, మన ఆసక్తుల్లో దాగి ఉంటుంది.

### బలం అంటే ఏమిటి?...

బలం అంటే ఏమిటి అనే ప్రశ్నకి సమాధానం కూడా చాలా ఆసక్తికరం. ప్రతిభ, నైపుణ్యం, ఆసక్తి, విలువలు..ఇవన్నీ ఒకేలా కనిపించినా వేర్వేరు. ప్రతిభ అనేది సహజంగా వచ్చే సామర్థ్యం. నైపుణ్యం..సాధనతో వచ్చే సామర్థ్యం. ఆసక్తి మనసు లాగే దిశ. విలువలు మనకు ముఖ్యమైన నైతిక ప్రమాణాలు. రాహుల్ అనే విద్యార్థికి చిన్నప్పటి నుంచే గణితం బాగా వచ్చేది. అది ఆ విద్యార్థి ప్రతిభ. తరువాత కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాడు ..అది నైపుణ్యం. సమస్యలు పరిష్కరించడం అంటే రాహుల్‌కి ఇష్టం..అది ఆసక్తి. సమాజానికి ఉపయోగపడాలి అనే భావన..ఆయన విలువ. ఈ నాలుగు కలిసినప్పుడు ఆయన డేటా సైంటిస్ట్ అయ్యాడు. విద్యార్థి బలం అనేది ఒకే అంశం కాదు; అది అనేక అంశాల కలయిక.

విద్యార్థులు తమ బలాలను ఎలా కనుగొనాలి? మొదటగా, రోజువారీ జీవితాన్ని పరిశీలించడం చాలా ముఖ్యం. ఏ పనిచేస్తే సమయం ఎలా గడిచిపోయిందో తెలియదు? ఏ పని చేస్తే ఉత్సాహం వస్తుంది?..ఒక బాలుడు గంటల తరబడి లెగో బ్లాక్స్‌తో నిర్మాణాలు చేస్తుంటే..ఆ బాలునిలో ఇంజినీరింగ్ మైండ్ ఉందన్నమాట. రెండవది, చిన్న విజయాలను గుర్తించడం. పరీక్షల్లో 100 మార్కులు రావడం మాత్రమే విజయం కాదు. ఒక చిన్న సమస్యను పరిష్కరించడం, ఒక స్నేహితుడికి సహాయం చేయడం, ఒక కొత్త ఆలోచన చెప్పడం..ఇవన్నీ బలాలకి సంకేతాలు.

### విద్యార్థుల్లోని ప్రతిభని ప్రోత్సహించాలి :

మన బలాలను ముందుగానే తెలుసుకోవడం ఎందుకు ముఖ్యం?..ఎందుకంటే అది విద్యార్థికి సరైన దిశను చూపిస్తుంది. తన మేధస్సు తెలిసిన విద్యార్థి ఏ సబ్జెక్ట్‌పై దృష్టి పెట్టాలో, ఏ కోర్సు ఎంచుకోవాలో, ఏ రంగంలో భవిష్యత్తు ఉందో స్పష్టంగా నిర్ణయించగలడు. రెండవది, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. 'నేను ఏదో ఒక విషయంలో బలంగా ఉన్నాను' అనే భావన విద్యార్థిని ముందుకు నడిపే శక్తి. మూడవది, పొరపాటు నిర్ణయాలు తగ్గుతాయి. ఈ ప్రయాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నిర్వాహకుల పాత్ర కూడా కీలకం. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను గమనించి, వారిలోని చిన్న విజయాలను, ప్రతిభను, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. తల్లిదండ్రులు పిల్లలను ఇతరులతో పోల్చకుండా వారి ఆసక్తులను గౌరవించాలి. పాఠశాల నిర్వా హకులు వివిధ క్లబ్బులు, కార్యకలాపాలు ఏర్పాటు చేసి విద్యార్థులు తమ నైపుణ్యాలని పరీక్షించుకునే వేదికలను ఏర్పాటుచేయాలి.

ఈ నేపథ్యంలో విద్యార్థి తనకు ఏ పని ఇష్టం, ఏ పని బాగా వస్తుంది, ఎక్కడ మెరుగుపడాలి అని ఆలోచించడం, అంటే 'స్వీయ మూల్యాంకనం' కీలక పాత్ర పోషిస్తుంది. విద్యార్థికి ఆత్మపరిశీలన అభిప్రాయాలు కోరడం, మార్గదర్శకులతో మాట్లాడడం ద్వారా శక్తి సామర్థ్యాలు స్పష్టమవుతాయి. పాఠ్యేతర కార్యకలాపాలు విద్యార్థిని పరీక్షించి నిజమైన సామర్థ్యాన్ని బయటపెడతాయి. వైఫల్యాలకి భయపడకుండా ప్రయత్నాలను కొనసాగిస్తే నేర్చుకునే శక్తి పెరుగుతుంది.

ముగింపుగా, ప్రతి విద్యార్థి ఒక విత్తనం. సరైన నేల దొరికితే మహావృక్షం అవుతాడు. మన విద్యా వ్యవస్థలో అత్యంత అవసరమైన మార్పు "విద్యార్థి ఏం చదువుతున్నాడు?" అనేదాని కంటే "విద్యార్థి ఎవరు? అతని బలం ఏమిటి?" అనే ప్రశ్న. విద్యార్థులు తమ మేధాశక్తిని తెలుసుకుంటే, తల్లిదండ్రులు వాటిని అంగీకరిస్తే, ఉపాధ్యాయులు వాటిని పెంపొందిస్తే, పాఠశాలలు వాటికి వేదికలు ఇస్తే..మన సమాజం ప్రతిభావంతులైన, ఆత్మవిశ్వాసంతో నిండిన, దిశ–దశ తెలిసిన యువతతో నిండిపోతుంది.



**వచ్చే వారం :** 'స్మార్ట్ స్టడీ అలవాట్లు'..ఎలా చదివితే నిజంగా నేర్చుకున్నట్టవుతుంది?'...

E-mail: reddyu@gmail.com

## జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై..

# రాజ్యసభలో బీఎంఆర్



నెల్లూరు జిల్లాలో సాగరమాల పథకం కింద నిర్మించిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనుల పూర్తి స్థితి, ప్రాజెక్టు వ్యయం, మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం మరియు ఉపాధి సృష్టి అంశాలపై రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ ఈనెల 3న రాజ్యసభలో ప్రశ్నించారు. కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ గారు అందుకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టుకు 18 మార్చి 2020న ఆమోదం లభించిందని, మొత్తం వ్యయం 288.80 కోట్లుగా నిర్ణయించ బడిందని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన అన్ని భాగాల పనులు పూర్తయ్యాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఫిషింగ్ హార్బర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన అనంతరం సుమారు 6,100 మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. 1,250 పడవలను నిర్వహించే సామర్థ్యం, సంవత్సరానికి 41,250 మెట్రిక్ టన్నుల చేపల ల్యాండింగ్ సామర్థ్యం కలగనుందని మంత్రి వివరించారు.

### అధిక సుంకాలతో ఇబ్బందులు :

అమెరికా ప్రభుత్వం అమలుచేసిన టారిఫ్ విధానాల వల్ల భారత ఎగుమతులు, దేశీయ పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితమవుతున్న అంశాన్ని బీఎంఆర్ ఈనెల 3న రాజ్యసభ జీరో అవర్‌లో ప్రస్తావించారు. 2025లో అమెరికా ప్రభుత్వం భారత ఉత్పత్తులపై 25 శాతం పరస్పర సుంకం విధించడంతో పాటు, రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించిన కారణాలతో మరో 25 శాతం శిక్షాత్మక సుంకం విధించిందని ఆయన తెలిపారు. దీనివల్ల భారత ఎగుమతులపై 50 నుంచి 58 శాతం వరకు సుంక భారం పడుతూ, దాదాపు 48 నుంచి 50 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ఎగుమతులు ప్రభావితమయ్యాయని పేర్కొన్నారు. అయితే, ఇటీవల పరస్పర సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించేందుకు వచ్చిన అవగాహన భారత ఎగుమతిదారులకు ఊరటనిచ్చే పరిణామమన్నారు.



## పెరుమాళ్లపాడు ఆలయానికి

# త్వరలో పూర్వవైభవం

### శ్రీ నాగలింగేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణకు మంత్రి ఆనం కృషి

నెల్లూరుజిల్లా చేజర్ల మండలం పెరుమాళ్లపాడు గ్రామ సమీపంలో పెన్నా నదీ తీరాన కొంతకాలం క్రితం పురాతన నాగలింగేశ్వరస్వామి ఆలయం బయట పడింది. అప్పట్లో ఇది సంచలనం కలిగించింది కూడా. దేవాదాయశాఖ అధికారులతో కలిసి, దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆ ఆలయాన్ని ఇటీవల సందర్శించారు. ఆ ప్రాచీన శైవ క్షేత్రాన్ని పునరుద్ధరించేందుకు కృషి ప్రారంభించారు. ఈ ఆలయం సుమారు 3వందల సంవత్సరాల నాటిదని భావిస్తున్నారు. నీటిప్రవాహం వల్ల ఆలయం ఇసుకలో కూరుకుపోయింది. 2020లో స్థానిక యువకులు దానిని గుర్తించడం జరిగింది. ఎంతో చరిత్ర కలిగిన ఈ దేవాలయంపై ఇసుకమేటలు తొలగించి, ఆలయ పూర్వవైభవాన్ని నిలబెడతామని ఆనం ఈ సందర్భంగా చెప్పారు.

## కేజీబీవీల్లో ఖాళీల భర్తీపై..

# లోక్‌సభలో విపిఆర్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రయత్నాలను వివరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) కోరారు. ఈ నెల 2న ఆయన లోక్‌సభలో కేజీబీవీల అంశంపై పలు ప్రశ్నలు వేశారు. రాష్ట్రంలో 587 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు గాను 490 మాత్రమే పనిచేస్తున్నాయనేది నిజమేనా అని ఆరా తీశారు. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో కెజిబివిలలో బాలికలు, ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, దివ్యాంగుల నమోదు వివరాలు, జిల్లా వారీగా డ్రాపౌట్ రేటు, రిటెన్షన్ రేటు, ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తిని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 587 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఉండగా.. వాటిల్లో 546 పని చేస్తున్నాయన్నారు. మిగతా కేజీబీవీల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని కేజీబీవీలలో ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి 1:21గా ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కేజీబీవీల్లో డ్రాపౌట్ రేట్ 0.81 శాతం ఉందన్నారు. రాష్ట్రంలోని 587 కేజీబీవీల్లో 277 టీచింగ్, 1095 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కేజీబీవీల్లో ఉపాధ్యాయుల నియామకం మరియు ఇతర సేవా విషయాలు రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాల పరిధిలోకి వస్తాయని, వీటిల్లో ఖాళీలను భర్తీ చేయడం నిరంతర ప్రక్రియ అని చెప్పారు.

### లోక్‌సభ స్పీకర్‌తో విపిఆర్ భేటీ

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 3న మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని స్పీకర్ కార్యాలయంలో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్పీకర్‌తో భేటీ అయిన ఎంపీ.. పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ భేటీలో పలువురు టీడీపీ ఎంపీలు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



కోటి రూపాయలు విరాళం ప్రకటించిన దాత బద్దేవోలు శ్రీహరిరెడ్డిని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

క్యాన్సర్ వ్యాధి పట్ల నిర్లక్ష్యం వద్దని, ఆ వ్యాధి లక్షణాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, ఏవైనా అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రజలకు పిలుపునిచ్చారు. రెడ్ క్రాస్ రజతోత్సవం, ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాలని పురస్కరించుకుని ఈనెల 4న స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ క్యాన్సర్ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి రోజుల్లో క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధిగా భావించినప్పటికీ, ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి సరైన వైద్యం అందితే పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం, పొగతాగడం, మద్యపానం వంటి హానికర అలవాట్లకు దూరంగా ఉండడం, సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం ద్వారా క్యాన్సర్‌ను చాలావరకు నివారించవచ్చని తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు కనిపించినా, భయపడకుండా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. తొలుత జిల్లాకలెక్టర్ రెడ్‌క్రాస్ రజతోత్సవ సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం క్యాన్సర్ హాస్పిటల్ అభివృద్ధికి విశేష సేవలందించిన దాతలను సన్మానించారు. ఈ సందర్భంగా దాత బద్దేవోలు శ్రీహరిరెడ్డి కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించగా, రంగయ్యనాయుడు హాస్పిటల్‌లో 5గదుల నిర్మాణానికి సహకరిస్తానని ప్రకటించారు. జె.ఎస్.రెడ్డి చారిటబుల్ ట్రస్ట్, భగవాన్ మహవీర్ ట్రస్ట్, సుమంత్‌రెడ్డి, దొడ్ల స్వాతి, డేవిడ్ పీటర్, సీతారాములు తదితర దాతలను కలెక్టర్ సన్మానించారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వై.డి.రామారావు, ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు, కోశాధికారి శ్రీహరిరావు, జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి, వైస్‌చైర్మన్ జనార్ధన్‌రాజు, సెక్రటరీ సురేష్‌జైన్, సభ్యులు యాలమూరి రంగయ్యనాయుడు, ఎడవల్లి సురేష్, వెంకటేష్ రంగాచారి, క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డా. లక్ష్మి, డా. నాగేశ్వరరావు, డా. ముత్తు, నెల్లూరు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, దాతలు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాకర్ల



ఇటీవల ఉదయగిరి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి-కుమారులు సయ్యద్ సాహేర, సయ్యద్ మజహర్‌లు ప్రాణాలు కోల్పోయిన ఘటనకు సంబంధించి, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈనెల 3న వారి స్వగ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా, మృతుల కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# రహదారి భద్రత..అందరి బాధ్యత!

### • వాక్‌థాన్‌లో ఉప రవాణా అధికారి చందర్





అవగాహనా ర్యాలీ(వాక్‌థాన్)ని ప్రారంభిస్తున్న ఉపరవాణా అధికారి చందర్, కిమ్స్ వైద్యులు... ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు

వాహనాలు నడిపేవారు ఎంతో జాగ్రత్తగా నడపాలని, రహదారి భద్రత.. అందరి బాధ్యత అని ప్రజలు భావించినప్పుడే రోడ్డు ప్రమాదాలు జరగకుండా సురక్షిత ప్రయాణం సాగుతుందని ఉప రవాణా అధికారి చందర్ చెప్పారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 31న రవాణాశాఖ ఆధ్వర్యంలో, కిమ్స్ వైద్యశాల వారి సహకారంతో జరిగిన అవగాహన ర్యాలీ(వాక్‌థాన్)లో ఆయన మాట్లాడుతూ, వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. తొలుత, స్థానిక సర్వోదయ కళాశాల వద్ద నుంచి గాంధీ బొమ్మ కూడలిమీదుగా, విఆర్‌సీ మైదానం వరకు ర్యాలీ జరిగింది. అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య మాట్లాడుతూ, రహదారి భద్రత గురించి మరియు ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి ప్రజలకు వివరించారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే జరిగే ప్రమాదాలు మరియు తీసుకునే చట్టపరమైన చర్యలను తెలియజేశారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ, రోడ్లపై ఎలాంటి ప్రమాదాలు జరుగుతుంటాయి, ప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, గోల్డెన్ అవర్ అంటే ఏమిటి..అనే విషయాలపై అవగాహన కలిగించారు. నారాయణ వైద్య కళాశాల విద్యార్థులు గుడ్ సమరిటన్ గురించి ఇచ్చిన డెమో అందరినీ ఆకట్టుకుంది. వాహనాల లైసెన్స్ యొక్క ప్రాముఖ్యత గురించి, పొల్యూషన్ గురించి, లైసెన్స్ తీసుకోవాలంటే ఏంచేయాలి తదితర అంశాలపై రవాణాశాఖ వారు అందరికీ అర్థమయ్యేవిధంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుజాత, అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ ఖాదర్‌వలి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.మాధవి, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ సిబ్బంది, కిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.


## అసంఘటిత కార్మికుల కోసం..
# 'పీఎం-శ్రమ్‌యోగి'



పీఎం-శ్రమ్‌యోగి పథకం ప్రయోజనాలను వివరిస్తున్న అధికారులు

అసంఘటిత కార్మికుల భవిష్యత్ భద్రతకు పీఎం-శ్రమ్ యోగి మాసన్ పథకం వినియోగించుకోవాలని నెల్లూరులోని ఉప కార్మిక కమిషనర్ సిహెచ్ విజయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. అసంఘటిత రంగ కార్మికుల వృద్ధాప్య భద్రతను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి శ్రమ్‌యోగి పథకాన్ని అర్హులైన ప్రతి అసంఘటిత కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ పథకం ద్వారా 18 నుండి 40 సంవత్సరాల వయస్సు కలిగి. నెలవారీ ఆదాయం రూ.15వేల లోపు ఉన్న అసంఘటిత రంగ కార్మికులు సభ్యత్వం పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ పథకంలో సభ్యత్వం పొందిన కార్మికులు 60 సంవత్సరాలు పూర్తి చేసిన అనంతరం ప్రతి నెల రూ.3వేలు పెన్షన్ పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఒకవేళ సభ్యుడు మరణిస్తే, జీవితభాగస్వామికి రూ,.1500 పెన్షన్ వస్తుందన్నారు. సభ్యుడు చెల్లించే నెలవారీ మొత్తానికి కేంద్రప్రభుత్వం సమాన మొత్తాన్ని జమచేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా లభించే పెన్షను, రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా ద్వారా ఇస్తున్న పెన్షన్‌కు అదనంగా లభిస్తుందని తెలిపారు. ఆమేరకు ఇటీవల స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఏపీఎంలకు ఈ పథకం పై అవగాహన కల్పించారు. జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులందరూ తమ వృద్ధాప్య భద్రత కోసం ఈ పథకాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఉప కార్మిక కమిషనర్ విజ్ఞప్తి చేశారు. సహాయ కార్మిక కమీషనర్ గౌస్, సహాయ కార్మిక అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో.. గాంధీజీకి నివాళులు



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న నెల్లూరు జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో బాపూజీ సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. స్థానిక గాంధీ బొమ్మ వద్ద జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, ప్రధాన కార్యదర్శి కే.సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సీపీఎం సీనియర్ నేత..
# జానా వెంకయ్య కన్నుమూత



సీపీఎం సీనియర్ నేత, జిల్లాలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ ప్రముఖుల్లో ఒకరైన జానా వెంకయ్య బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన వయస్సు 84 సంవత్సరాలు. నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు ఆయన స్వగ్రామం. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమాల్లో కీలకంగా పనిచేశారు. నెల్లూరు డివిజన్ సీపీఎం శాఖల ఏర్పాటులోనూ, నూతన నాయకత్వాన్ని పెంపొందించడంలోనూ ప్రధాన పాత్ర పోషించారు. నెల్లూరు, గోమతినగర్‌లోని నివాసంలో ఆయన భౌతికకాయాన్ని సీపీఎం నేతలు, అభిమానులు, వామపక్షాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. జానా వెంకయ్య మృతి పార్టీకి తీరని లోటంటూ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం ఆయన కుమారులు ఆయన మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాలకి దేహదానంగా సమర్పించారు.

# బియ్యం అక్రమ రవాణా.. నియంత్రణకు చర్యలు



జేసీ వెంకటేశ్వర్లు

జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ బియ్యం అక్రమరవాణా జరుగుతోందన్న సమాచారాన్ని దృష్టిలో ఉంచుకొని, దానిని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టిందన్నారు. కలెక్టరేట్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా రెండు డిస్ట్రిక్ట్ లెవల్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, అలాగే నెల్లూరు అర్బన్ ప్రాంతంలో ఆరు మొబైల్ టీమ్స్‌ను రెండు షిఫ్ట్‌లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టీమ్స్ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక షిఫ్ట్‌గా, సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6గంటల వరకు మరో షిఫ్ట్‌గా 24 గంటల పాటు నిరంతరంగా విధులు నిర్వహిస్తాయన్నారు. ప్రతి టీమ్‌లో పోలీస్‌శాఖకు చెందిన సీఐ, ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ క్యాడర్ సిబ్బంది, సివిల్ సప్లయిస్ శాఖకు చెందిన సిఎస్డీటీ, రెవెన్యూ శాఖకు చెందిన వీఆర్వోలను నియమించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ కార్డు దారులందరూ తమకు అర్హత మేరకు కేటాయించిన రేషన్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని ఈ సందర్భంగా జేసి కార్డుదారులకు సూచించారు.

# వేదపండితులకు.. 'కామధేను' పురస్కారాలు



వేదపండితునికి 'కామధేను' పురస్కారాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

ఇందుకూరుపేటలోని శ్రీ రామాయణం మహేష్‌స్వామి వారి లలితా మహేశ్వరి ఆశ్రమంలో ఇటీవల పలువురు పీఠాధిపతులు, వేదపండితులు, అర్చకులకు 'కామధేను' పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా యువజన శాఖ అధికారి నాగేశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్ భానుమతి, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, విజయ దుర్గాపీఠం ఉప పీఠాధిపతి కోట సునీల్‌కుమార్ స్వామి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆంధ్ర, తెలంగాణ, బ్రాహ్మణ సంఘాల నాయకులు ఆత్మకూరు శివయ్య స్వామి, వాకాని కృష్ణమాచార్యులు, పారా శ్రీధర్ శర్మ, వరప్రసాద్, వాసుదేవరావు, కామేశ్వర ప్రసాద్, రమేష్, మహేష్, నాగఫణిశర్మ, ప్రసాద్, మణిశంకర్, ప్రభాకర్‌శాస్త్రి, సుదర్శనం, జగదీశ్వర్‌శర్మలకు ముఖ్య అతిథులు కామధేను పురస్కారాలను ప్రదానం చేశారు. టీటీడీ మాజీ ఇ.ఓ కేవీ రమణాచారి ప్రవేశపెట్టిన ఈ పురస్కారాల ప్రదానోత్సవాలకు గత 14 సంవత్సరాలుగా జిల్లాకి చెందిన కళాకారుడు మైపాడు రాజా కన్వీనర్‌గా ఉంటూ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుండడం విశేషం!

# ఏసీ స్టేడియంలో క్యాన్సర్ డే



క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రతిభా భారతి

నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల క్యాన్సర్ డే ను నిర్వహించి, క్యాన్సర్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.ప్రతిభా భారతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధి లక్షణాలను, ప్రాథమికంగా ఆ వ్యాధిని ఎలా గుర్తించాలి తదితర విషయాలను వివరించారు. 203-గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు ఏపిపి ఏకొల్లు రాఘవరెడ్డి అధ్యక్షులు షేక్ నసీర్‌అహ్మద్, కార్యదర్శి శానంపూడి సుబ్బ రాయుడు, కోశాధికారి సితారి రత్నం గౌరవాధ్యక్షులు బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్ జీవీ కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, బెల్లం చెంచయ్యనాయుడు, యు.గోవర్ధన్, రమణయ్య, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వసుంధరాదేవి, కార్యదర్శి జయరాం పాల్గొన్నారు.

## టూకీగా...



### కోవూరుపల్లి ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం

బోగోలు మండలం కోవూరుపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశాన్ని అధికారులు ఇటీవల నిర్వహించారు. ఆరోగ్యకేంద్రంలో సేవలు మరింతగా రోగులకు అందుబాటులో ఉండేందుకు ఎలాంటి వసతులు కల్పించాలో చర్చించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ శ్రీనివాసులు రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కలువాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా ఈనెల 2న మండల కేంద్రమైన కలువాయిలోని బీవీఎన్ఆర్ హైస్కూల్‌లో అటవీశాఖ రేంజర్ జనార్దన్ ఆధ్వర్యంలో 8,9 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమంగా ఉన్న వ్యాసాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్‌అలీ తదితరులు పర్యవేక్షించారు.

### పడుగుపాడులో 'జల్‌జీవన్' పనుల పరిశీలన

కోవూరు మండలం పడుగుపాడులో ఈనెల 2న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయభాస్కర్ జల్‌జీవన్ మిషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు నాణ్యతగా ఉండాలని, మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. పడుగుపాడు, కోవూరుల్లో ఉన్న మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకులను కూడా పరిశీలించారు. డీఇ శ్రీనివాస్, ఏఇ జగదీష్ పాల్గొన్నారు.

### సంగం పాఠశాల లైబ్రరీకి పుస్తకాల వితరణ

సంగంలోని మండల ప్రాథమిక పాఠశాల లైబ్రరీకి లెర్న్ అండ్ హెల్ప్ బృందం సహకారంతో ఇటీవల రూ.10వేల విలువైన 386 పుస్తకాలను దాతలు డా.జాస్తి శివరామకృష్ణ, డాక్టర్ సీపీ ప్రసాద్‌లు వితరణగా అందజేశారు. ఎంఇఓ మల్లయ్య, విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ పావని, ప్రధానోపాధ్యాయుడు వి.నరేష్, ఉపాధ్యాయురాలు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

### చేజర్ల ఎంపీపీ కార్యాలయం తనిఖీ

చేజర్ల మండల పరిషత్ కార్యాలయాన్ని ఇటీవల జడ్పీ సీఇఓ శ్రీధర్‌రెడ్డి సందర్శించారు. వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులు పరిశీలించారు. జడ్పీ అతిథి గృహాన్ని కూడా పరిశీలించారు. ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ అమర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### బుక్కాపురంలో ఇంటిపన్నుల వసూళ్ళపై ఆరా

వింజమూరు మండలంలోని బుక్కాపురం పంచాయతీలో ఇళ్ల పన్నుల వసూళ్లు ఎలా జరుగుతున్నాయో ఇటీవలఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి, డిప్యూటి ఎంపీడీఓ కె.రామారావు ఆరా తీశారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి, గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. స్థానిక నాయకులు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

### రుద్రకోటలో ఉచిత నేత్రవైద్య శిబిరం

కావలి రూరల్ మండలంలోని రుద్రకోట ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ఇటీవల కావలి ఆర్టీఓ మురళీధర్, ఎంవీఐ సుందరరావుల ఆధ్వర్యంలో, నెల్లూరులోని మోడరన్ ఐ ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత నేత్రవైద్య శిబిరం జరిగింది. ఆటో, బస్సు, లారీల డ్రైవర్లకు, స్థానిక ప్రజలకు కంటిపరీక్షలు నిర్వహించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు.

### కోవూరులో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఈనెల 1న ఎస్ఐ ముత్యాలరావు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రవర్తన మార్చుకుని బుద్ధిగా నడుచుకోకుంటే చర్యలు తప్పవన్నారు.

### కలిగిరిలో ఉపాధ్యాయినులకు సన్మానం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇటీవల ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్న కలిగిరి మండలంలోని పలువురు ఉపాధ్యాయినులను ఎంఇఓ సురేష్ ఈనెల 4న సన్మానించారు. అవార్డులు అందుకున్న ఎం.శైలజ, వి.శిరీష, కె.సుమతి, కె.కళ్యాణి, ఎం.లత, పి.సుకన్య, పి. సుజిత, ఎస్.ఉమ, డి.అంకమ్మ, వి. మధురవాణిలను ఆయన అభినందించారు.

# వైసీపీ బుద్ధి మారాలంటూ.. 'ఆనం' పూజలు



రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కాకర్ల, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శీనయ్య తదితరులు

కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ దేవదేవుని సంస్కృతి, సాంప్రదాయాలు, తిరుమల ప్రసాదాలను సైతం వ్యాపారమయం చేసిన వైసీపీ నాయకులకు ఆ దేవుడు మంచిబుద్ధి ప్రసాదించాలని కోరుతూ ఈనెల 1న కూటమి నాయకుల ఆధ్వర్యంలో నెల్లూరు రంగనాథస్వామి దేవాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వైసీపీ నాయకుల తీరును దుయ్యబట్టారు. తిరుమల పవిత్రత గురించి, ప్రసాదాల గురించి పదేపదే చర్చకు రావడం దురదృష్టకరమన్నారు. సరైన ఆలోచనా విధానం నిర్ధిష్టమైన అజెండా ఏమీ లేని పార్టీ..వైసీపీ అన్నారు. వారు తప్పులు చేస్తూ కూడా, ఎదుటి వారిపై నిందలు మోపే కుసంస్కృతి ప్రతిపక్షానికి సొంతమన్నారు. ప్రతిపక్షహోదాకు సైతం పనికిరారని ప్రజలు నిర్వద్దంగా తిరస్కరించిన ఆ పార్టీ అత్యంత జుగుస్పాకరమైన రాజకీయాలు చేస్తోందన్నారు.

### కల్తీ నెయ్యికి ఆజ్యం పోసింది వైసీపీయే..

తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడలేదని వైసీపీ వారు..వారికి వారే క్లీన్‌చిట్ ఇచ్చుకుంటున్నారని మంత్రి ఆనం ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. 'సిట్' పూర్తిస్థాయి నివేదిక సమర్పించకముందే వారే ఏదేదో మాట్లాడుతున్నారని, నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్ట్‌ని వారి దగాకోరు సంస్థలకి కట్టబెట్టడానికి టెండర్ నిబంధనలను మార్చేసి కల్తీ జరగడానికి ఆజ్యం పోశారన్నారు. అనర్హులకు టెండర్ దాఖలుకు అవకాశం కల్పించడానికి టీటీడీ ఛైర్మెన్ పీఏకి కోట్ల రూపాయల నిధులు అందచేస్తే, మిగిలిన పెద్ద నాయకులు ఏ మేరకు దోపిడీ చేశారో అర్థం అవుతుందన్నారు. ఎమ్మెల్యేలు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఇంచార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నం సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై సోమిరెడ్డి సమీక్ష



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆలయ, ప్రభుత్వాధికారులు

ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని ప్రాచీన క్షేత్రం.. శ్రీ సిద్ధేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి వైభవోపేతంగా జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల బ్రహ్మోత్సవాల పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. నెల్లూరులోని అన్నిశాఖల అధికారులతో సమావేశమై చర్చించారు. బ్రహ్మోత్సవాలకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఆలయానికి విద్యుత్ దీపాల అలంకరణ, క్లాత్ పందిర్లు తదితర సౌకర్యాలతోపాటు, భక్తులకు తాగునీటి సదుపాయం, దేవస్థాన ప్రాంగణంతోపాటు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, తాత్కాలిక మరుగుదొడ్లు అన్నీ సక్రమంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా అదానీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కల్పించే సౌకర్యాలపై కూడా చర్చించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆలయ చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, ఆర్డీఓ నాగ అనూష, డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్ఆర్ ట్రస్ట్‌ను సందర్శించిన.. సద్గురు శ్రీ మధుసూదన్ సాయి

## • ట్రస్ట్‌లో 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేస్తామన్న స్వామీజీ



కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలను సత్కరిస్తున్న శ్రీ మధుసూదన సాయి, పక్కన డిఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బీయింగ్ ఫార్మా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలాజీరెడ్డి

బెంగళూరుకు చెందిన సద్గురు శ్రీ మధుసూదన్‌సాయి స్వామీజీ ఈనెల 2న అల్లూరు మండలం నార్తమోపూరు గ్రామంలోగల డిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ను సందర్శించారు. స్వామీజ రాకతో ట్రస్టులో సందడి నెలకొంది. ఈ ట్రస్టు సందర్శన కోసం ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో అల్లూరుకు వచ్చి, అక్కడనుంచి రోడ్డు మార్గంలో ట్రస్టు ప్రాంగణానికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు పెద్దసంఖ్యలో గ్రామస్తులు, ఆయనని దర్శించుకోవడానికి తరలివచ్చారు. ట్రస్టు ఛైర్మెన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, స్వామిజీని సాదరంగా స్వాగతించారు. అంకిత భావంతో విద్య, వైద్య రంగాలలో ట్రస్టు నిర్వాహకులు చేస్తున్న సేవలను తెలుసుకుని శ్రీ మధుసూదన్‌సాయి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవసేవే మాధవసేవ అని తమ గురువైన భగవాన్ సత్యసాయి ఎప్పుడూ బోధిస్తుండేవారని, ప్రజలకు సేవచేస్తే ఆ శ్రీరాముని సేవించినట్లేనని అంటుండేవారని ఆయన అన్నారు. "వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్ ట్రస్ట్" సహకారంతో డిఎస్ఆర్ ట్రస్ట్‌లో వైద్యసేవలను మరింతగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

సమాజ హితమే లక్ష్యంగా స్థాపించబడిన బీయింగ్ ఫార్మర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలాజీరెడ్డి సూచన మేరకు తాను ఇక్కడికి వచ్చినట్లు స్వామిజీ చెప్పారు. రైతు శ్రేయస్సుతోపాటు సమాజ సేవే లక్ష్యంగా బీయింగ్ ఫార్మా ఫౌండేషన్ నెలకొల్పిన బాలాజీ రెడ్డిని కూడా మధుసూదన్ సాయి ప్రత్యేకంగా అభినందించారు.

భవిష్యత్తులో డిఎస్ఆర్ ట్రస్ట్‌ను తమ వైద్యసేవా కేంద్రానికి అనుసంధానం చేస్తామని, అన్ని హంగులతో 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటుచేసి, ప్రజలకు ఉచిత సేవలను అందిస్తామని తెలిపారు. డిఎస్ఆర్ ట్రస్టు సభ్యులు దేవిరెడ్డి దశరథ రామిరెడ్డి, దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు, ట్రస్టు అడ్మిన్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డా.సతీష్‌రెడ్డికి.. 'రోటరీ సేవారత్న' పురస్కారం

## • పూర్వ ఉప రాష్ట్రపతి.. వెంకయ్య చేతుల మీదుగా ప్రదానం



డా. సతీష్‌రెడ్డికి 'రోటరీ సేవారత్న' పురస్కారాన్ని అందజేస్తున్న వెంకయ్యనాయుడు

రక్షణ రంగ పరిశోధనల్లో విశేష కృషి చేసిన డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, జాతీయ భద్రతా మండలి సభ్యులు మరియు ఏపీ ఏరో డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డిని ప్రతిష్టాత్మకమైన 'రోటరీ సేవారత్న' అవార్డు వరించింది. హైదరాబాద్ నగరంలోని రాయదుర్గం జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్లో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్–3150 ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సదస్సులో డాక్టర్ సతీష్‌రెడ్డికి మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ దేశాల అభివృద్ధి శాంతితోనే సాధ్యమని, భారత్ ఎప్పుడూ శాంతినే కాంక్షిస్తుందని ఆయన చెప్పారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150' ఆధ్వర్యంలో నిర్వహించిన 'మనోహరం' సదస్సులో డాక్టర్ సతీష్‌రెడ్డితో పాటు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురికి రోటరీ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. తనకు 'సేవారత్న' పురస్కారం లభించడంపై డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ, పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సోమవరపు రామప్రసాద్ పాల్గొన్నారు.

## అపూర్వ గ్రంథం..డా. రేవూరు వారి

# 'తెలుగు జాతికి భూషణాలు'

### ప్రశంసించిన మన వెంకయ్యనాయుడు



డా. రేవూరు అనంతపద్మనాభరావు దంపతులను సత్కరిస్తున్న వెంకయ్యనాయుడు

ప్రముఖ రచయిత, దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ డా. రేవూరు అనంతపద్మనాభరావు తన 80వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వెలువరించిన 'తెలుగు జాతికి భూషణాలు'.. ఒక అపూర్వ గ్రంథమని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ప్రశంసించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 29న జరిగిన గ్రంథావిష్కరణ సభలో వెంకయ్యానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, దేశ అత్యున్నత పురస్కారాలైన భారతరత్న, పద్మ అవార్డులు పొందిన తెలుగువారి జీవిత సంగ్రహమే 'తెలుగుజాతికి భూషణాలు' అని, సమాజానికి మార్గదర్శకంగా ఈ పుస్తకాన్ని రచించారని, దీనిని ప్రతిఒక్కరూ చదివి అందులోని మంచి విషయాలను తెలుసుకోవాలని సూచించారు. డా. రేవూరు వంటి వ్యక్తుల నుంచి యువత స్ఫూర్తిని పొందాలన్నారు. అనంతరం నిర్వాహకులు డా. రేవూరుకి జన్మదిన శుభాకాంక్షలు చెప్తూ, అనంతపద్మనాభరావు–శోభాదేవి దంపతులను సన్మానించారు. డా. రేవూరు వారి సమగ్ర సాహత్య పరిశోధనతో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ పర్యవేక్షణలో చేసిన పరిశోధన (థీసిస్) ప్రతిని ఈ సందర్భంగా ముఖ్య అతిథులకు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కేవీ రమణాచారి సభకు అధ్యక్షత వహించారు. కేంద్రప్రభుత్వ హోంశాఖ పూర్వ సెక్రటరీ.. పద్మభూషణ్ కె.పద్మనాభయ్య, సాహితీవేత్తలు ఓలేటి పార్వతీశం, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ బాటలో నడవాలి

మహాత్మాగాంధీజీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న మండల కేంద్రమైన అల్లూరులోని బాపూజీ పార్క్‌లో జాతిపిత, మహాత్మాగాంధీ విగ్రహానికి శాసనమండలి సభ్యులు, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు బీద రవిచంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ సేవలు మార్గదర్శకమని, ప్రతిఒక్కరూ ఆ మహనీయుని ఆశయాల బాటలో నడవాలని అన్నారు. అనంతరం స్థానిక టీడీపీ నేతలతో కలిసి బాపూజీ పార్క్ పరిసరాలను పరిశీలించారు. బీద గిరిధర్, బండి శ్రీనివాసులు, పలగాటి శ్రీనివాసులు, కృష్ణ చైతన్య, హరీష్‌రెడ్డి, తిరుమల తదితరుల పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com